మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

బుధవారం 04-02-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 103

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

**విలేకరులు కావలెను**




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## సూత్రధారులు తేలాలి...

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు

### సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్

- కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు
- కల్తీ సంగతి తెలిసీ మౌనంగా వైకాపా పాలకులు
- సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారు
- కేబినేట్ వివరాలను వెల్లడించిన మంత్రులు






**అమరావతి -ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
కల్తీ లడ్డూ వ్యవహారంలో నివ్వెరపోయే నిజాలు వెలుగు చూశాయని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ మంత్రి వర్గ సమావేశం ముగిసిన తర్వాత మంత్రులతో కలిసి పయ్యావుల మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు పక్కనపెట్టి మరీ తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారాన్ని సమావేశంలో చర్చించినట్లు

-మిగతా 3 లో

## రాజ్యాంగాన్ని గౌరవించుకుంటే

# దేశం వీడండి

### వాట్సాప్ కు సుప్రీం కోర్టు వార్నింగ్

- వాట్సాప్ ప్రైవసీ పాలసీపై విచారణ
- ఒక్క అక్షరం కూడా షేర్ చేయొద్దు
- దేశ గోప్యతను అడ్డుకోలేరు
- ఇక్కడి చట్టాలను గౌరవించుకుంటే వెళ్లిపోండి
- మెటా సంస్థ తీరుపై సుప్రీం ఆగ్రహం


**న్యూఢిల్లీ,--ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ప్రైవసీ పాలసీ విషయంలో వాట్సప్ మాతృ సంస్థ మెటాపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మీరు మా దేశ గోప్యతతో ఆడుకోలేరు. మా డేటాలోని ఒక్క అంకెను కూడా పంచుకోవడానికి మేం అనుమతించం. ఒకవేళ దేశ చట్టాలను పాటించకపోతే భారత్‌ను వీడి వెళ్లొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. 2021లో వాట్సప్‌లో గోప్యతా విధానానికి సంబంధించిన ఓ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. తమ వాణిజ్య ప్రయోజనాల కోసం వాట్సప్ వినియోగదారుల డేటాను మెటాతో పంచుకుంటోందని.. ఇది దోపిడీ కిందకే వస్తుందని ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. మెటాను హెచ్చరించారు. వాట్సాప్ ప్రైవసీ పాలసీపై అసహనం వ్యక్తం చేసారు. భారత్‌లో కార్యకలాపాలు సాగించాలంటే ఇక్కడి చట్టాలను పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేసారు.

-మిగతా 3 లో



## భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

- చమురు దిగుమతులపై చర్చ జరగలేదు
- చమురు కొనుగోలు నిలిపివేస్తారన్నది అవాస్తవం
- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన రష్యా



**న్యూఢిల్లీ,**
అమెరికాతో భారత వాణిజ్య ఒప్పందం వేళ రష్యా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ స్పందించింది. రష్యా నుంచి చమురు దిగుమతులు నిలిపివేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారన్న ట్రంప్ మాటల్లో వాస్తవం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ పరోక్షంగా వెల్లడించారు. ఈ అంశంపై న్యూఢిల్లీ నుంచి తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇప్పటివరకు దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని ఆయన స్పష్టం చేశారు. భారత్ తమకు అత్యంత కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని, రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలంగా ఉన్నాయని పెస్కోవ్

-మిగతా 3 లో



## ఏపిలో రెడ్ బుక్ రాజ్యాంగం

- దాడులు, అక్రమ కేసులు పెరిగాయి
- పార్లమెంట్ ఆవరణలో వైకాపా ఎంపిల నిరసన
- రాష్ట్రపతి పాలన విధించాలని ఎంపిల డిమాండ్

**న్యూఢిల్లీ -ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు లక్ష్యంగా దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని వెరసి శాంతి భద్రతలు విఫలమయ్యాయని వైఎస్‌ఆర్‌సీపీ ఎంపీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పార్లమెంటు ఆవరణంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఏపీలో కూటమి ఆటవిక పాలనను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ పార్లమెంట్

-మిగతా 3 లో



## ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

- మోడీ అమెరికాకు అమ్ముడు పోయారు
- ఆదానీ కేసులో మోడీకి భయం పట్టుకుంది
- అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,-**
అమెరికా, భారత్ మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రధాని మోదీ అమ్ముడుపోయినట్లు పేర్కొన్నారు. ట్రంప్ వత్తిడికి మోదీ తలొగ్గినట్లు ఆరోపించారు. పార్లమెంట్ ఆవరణలో మీడియాతో రాహుల్ మాట్లాడారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ కేసు వల్ల ప్రధాని మోదీ తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు ఆరోపించారు. అదానీపై అమెరికాలో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో కూడా మోదీ ఆందోళనలో ఉన్నట్లు రాహుల్ పేర్కొన్నారు. మోదీజీ భయపడుతున్నారని, నాలుగు నెలలుగా వాణిజ్య ఒప్పందం స్తంభించిందని, కొన్ని కారణాల తప్ప ఏమీ మారలేదని, నిన్న సాయంత్రం ఒప్పందం కుదుర్చుకున్నారని గాంధీ అన్నారు. నరేంద్ర మోదీపై తీవ్రమైన వత్తిడి ఉన్నట్లు రాహుల్ తెలిపారు. మోదీ ఇమేజ్‌కు చెందిన బెలూన్ వేల కోట్లతో తయారైందని, అది ఏ క్షణమైనా పేలుతుందని ప్రతిపక్ష నేత అన్నారు.

-మిగతా 3 లో

## మన సహనమే విజయానికి బాట

### విమర్శలు వచ్చినా ఓర్పుతో సహించాం

- ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టాం
- అదే ఇప్పుడు మనలను ముందకు తీసుకెళ్లింది
- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై ప్రధాని మోడీ
- ఎన్‌డిఏ సమావేశంలో మోడీని సన్మానించిన ఎంపిలు

**న్యూఢిల్లీ,-ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ఇంతకాలం సహనంగా ఉన్నందువల్లనే అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమనకు అనుకూలంగా మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఇది ఓ చారిత్రాత్మక ముందడుగగా ఆయన అభివర్ణించారు. ఎన్ని విమర్శలు వచ్చినా తట్టుకుని ఓర్పుతో ఓపిక పట్టామని అన్నారు. అమెరికాతో భారత్ కుదుర్చుకున్న చారిత్రక వాణిజ్య ఒప్పందంపై ఎన్డీఏ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు.భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు.

-మిగతా 3 లో








## పాలకులే గుండాల్లా.. రౌడీల్లా మారారు

- మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం' అని హెచ్చరికలా
- రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్న టిడిపి నేతలు
- మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని




## సంయమనంతో టిడిపి కార్యకర్తలు

- రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా బాబు కంట్రోల్
- వైసిపి ఉచ్చులో పడకుండా చూసుకుంటున్నాం
- హోంమంత్రి వంగలపూడి అనిత



## రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

- అమెరికాతో ట్రేడ్ డీల్‌పై చర్చకు పట్టు
- లోక్‌సభలో విపక్షాల ఆందోళనతో సభ వాయిదా

**న్యూఢిల్లీ,**
ప్రతిపక్షాల నిరసనల మధ్య మంగళవారం లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తూ వెల్‌లోకి దూసుకువెళ్లడంతో గందరగోళం నెలకొంది. కొత్తగా ప్రకటించిన భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చ చేపట్టాలంటూ కాంగ్రెస్ ఎంపి కె.సి.వేణుగోపాల్ వాయిదా తీర్మానం సమర్పించారు. దీనిపై చర్చించాలని డిమాండ్ చేస్తూ వెల్‌లోకి దూసుకుని వచ్చారు. అయితే స్పీకర్ ఓం బిర్లా పదేపదే వారిని సముదాయించే ప్రయత్నం చేశారు.రాష్ట్రపతి ప్రసంగం, బడ్జెట్‌పై చర్చ జరగాల్సి ఉందన్నారు. చర్చల ద్వారానే సమ్యలకు పరిష్కారం దక్కుతుందని అన్నారు. నినాదాలు, ఆందోళన సరికాదని అన్నారు. అయినా విపక్షం వెనక్కి తగ్గకపోవడంతో సభను మధ్యాహ్నం 12గంటలకు వాయిదా వేశారు. ఇక వాయిదా తీర్మనంలో కెసి వేణుగోపాల్ పలు అంశాలు ప్రస్తావించారు. నివేదించిన ఒప్పందంలో గణనీయమైన ఆర్థిక, వ్యవసాయ,

-మిగతా 3 లో

# మరోమారు ఝలక్ ఇచ్చిన పసిడి ధరలు

**తగ్గినట్లే తగ్గి పెరిగిన బంగారం, వెండి రేట్లు**



**హైదరాబాద్, -ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
తగ్గినట్లే తగ్గిన బంగారం, వెండి ధరలు మరోసారి పెరిగాయి. యూఎస్ ఫెడ్‌కు కొత్త ఛైర్మన్ నియామకం, సీఎంఈ మార్జిన్‌ను పెంచడం, గరిష్ఠాల వద్ద భారీ ప్రాఫిట్ బుకింగ్ కారణంగా ఈ రెండు లోహాల ధరలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. దీన్ని అవకాశంగా తీసుకుని మదుపర్లు దీర్ఘకాలిక వ్యూహంతో కొనుగోళ్లకు దిగడంతో వీటికి మళ్లీ డిమాండ్ ఏర్పడింది. దీంతో  అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లో బంగారం ఔన్సు 4,887 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. వెండి 85.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.దీంతో దేశీయంగానూ ఈ రెండు లోహాల ధరలు పెరిగాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయానికి 10 గ్రాముల మేలిమి పసిడి ధర 1.56 లక్షల వద్ద కొనసాగుతుండగా.. కిలో వెండి ధర రూ.2.74 లక్షలు పలుకుతోంది. సోమవారం ధరలతో పోలిస్తే బంగారం దాదాపు రూ.6 వేలు పెరగ్గా.. వెండి రూ.20 వేలకు పైగా పెరిగింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ 10 గ్రాముల బంగారం ఏప్రిల్ కాంట్రాక్టు ధర రూ.1.51 లక్షల వద్ద ట్రేడవుతుండగా.. కిలో వెండి రూ.2.60 లక్షల వద్ద కొనసాగుతోంది.

# మణిపూర్ కొత్త సింఎంగా యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్




**ఇంఫాల్,-ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనకు ఏడాది పూర్తికానున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కొత్త సీఎంగా భాజపా నేత యుమ్నం ఖేమ్‌చంద్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. మంగళవారం ఆయన భాజపా శాసనసభాపక్ష నేతగా ఎన్నికయ్యారు. బిజెపి అధిష్టానం అయనను ఎంపికచేసింది. అలాగే, మహిళా నేత నెమ్చా కిప్‌జెన్ ఉప ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. మణిపుర్ ప్రస్తుత శాసనసభ పదవీకాలం 2027 వరకు ఉంది. 2023 మే నుంచి జాతుల మధ్య ఘర్షణలతో మణిపుర్ అట్టుడికింది. 250 మందికిపైగా మృతి చెందగా.. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలోనే గతేడాది ఫిబ్రవరిలో సీఎం బీరెన్ సింగ్ రాజీనామా చేయడంతో అక్కడ రాష్ట్రపతి పాలన విధించిన విషయం తెలిసిందే. బీరెన్‌సింగ్ రాజీనామాతో ఏడాది కాలంగా సీఎం పోస్టు ఖాళీగా ఉండటంతో... తాజా పరిణామాల నేపథ్యంలో కొత్త సీఎంగా ఖేమ్‌చంద్ బాధ్యతలు చేపట్టనున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.మణిపుర్ అసెంబ్లీలో మొత్తం 60 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం 37 మంది భాజపా ఎమ్మెల్యేలు ఉన్నారు. నేషనల్ పీపుల్స్ పార్టీ నుంచి ఆరుగురు, కాంగ్రెస్, నాగా పీపుల్స్ ఫ్రంట్‌ల నుంచి ఐదుగురు చొప్పున, కుకీ పీపుల్స్ అలయన్స్ నుంచి ఇద్దరు, జేడీయూ నుంచి ఒకరు, ముగ్గురు స్వతంత్రులు ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ఒక స్థానం ఖాళీగా ఉంది.

# అమెరికాతో ట్రేడ్ డీల్‌తో ఉజ్వల భవిష్యత్

**కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడి**

**న్యూఢిల్లీ,-ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**



అమెరికాతో వాణిజ్య ఒప్పందం భారత ఉజ్వల భవిష్యత్తుకు ఒక శుభసూచకమని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ ఒప్పందాన్ని ప్రధాని మోదీ కొలిక్కి తీసుకొచ్చారని, ఈ విషయంలో దేశమంతా ఆయనకు అభినందనలు చెబుతోందన్నారు. ఈ ఒప్పందంతో పేదలు, రైతులు, యువత, మత్స్యకారులకు అపారమైన అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజీపడకుండా.. పోటీదారులతో పోలిస్తే భారత్ మెరుగైన ఒప్పందాన్ని సాధించిందన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై పార్లమెంటులో ప్రకటన చేద్దామని భావించాను. కానీ.. రాహుల్ గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ గందరగోళ పరిస్థితులను సృష్టించింది. ఈ ఒప్పందంపై దేశాన్ని తప్పుదోవ పట్టించేందుకు ఆయన యత్నిస్తుండటం విచారకరం. దేశ ప్రగతితో ఆయనకు ఎలాంటి సంబంధం లేదు. ఈ ఒప్పందంలో మన దేశ వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల ప్రయోజనాలను ప్రధాని మోదీ  పరిరక్షించారు. ట్రంప్‌తో ఉన్న సత్సంబంధాల కారణంగా రెండు దేశాల మధ్య మంచి ఒప్పందం కుదిరింది. ప్రతీకార సుంకాలను విధించింది అమెరికానే కాబట్టే.. సుంకాల తగ్గింపునకు సంబంధించిన ప్రకటన కూడా ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ (ఆనీనిజీటె ÷ుసబీపూ) నుంచే వచ్చింది. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన తుది వివరాలను ఖరారు చేస్తున్నాం. త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని వెల్లడించారు.

# రైతులకు తీవ్ర ద్రోహం చేసిన మోడీ

**ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి**
**అమెరికాతో వాణిజ్య ఒప్పందపై అఖిలేశ్ విమర్శలు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
భారత్ అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడంపై సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కేంద్రంపై విరుచుకుపడ్డారు. ఈ ఒప్పందంతో కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం దేశ రైతులకు తీవ్ర ద్రోహం చేసిందని ఆయన ఫైర్ అయ్యారు. ఈ ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయోత్పత్తులకు భారత్ మార్కెట్‌ను తెరవడం.. దాదాపు 70 శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు ద్రోహం చేసినట్లేనని ఆయన ఆరోపించారు. ఈమేరకు ఆయన మంగళవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'రైతులపై బిజెపి మళ్లీ దాడి చేసింది. ఈ ఒప్పందంపై బిజెపి ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. ఈ ఒప్పందం చేసుకోవాలని మీపై జరిగిన ఒత్తిడి ఏమిటి? అమెరికన్ వ్యవసాయోత్పత్తులు, ఆహార ధాన్యాలకు భారతదేశ మార్కెట్లను తెరవడం మన దేశ రైతులను మోసం చేయడమే. ఇప్పటికే దేశంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. స్వాతంత్యానికి ముందే బిజెపి సభ్యులు, వారి మిత్రపక్షాలు విదేశీయుల ఏజెంట్లుగా ఉన్నారు. నేటికీ వారు విదేశీ ఏజెంట్లుగానే ఉన్నారు. బిజెపి సభ్యులు, వారి మిత్రులు పదేపదే స్వావలంబన, స్వదేశీ గురించి మాట్లాడతారు. అలాంటిది.. దేశ ఆర్థిక వ్యవస్థను మోసం చేసినందుకు, అమెరికాతో ఒప్పందం చేసుకునేందుకు వారు ఎంత కమిషన్ సంపాదించారో ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి' అని ఎక్స్ పోస్టులో అఖిలేష్ నిలదీశారు. అలాగే బిజెపి అనుసరిస్తున్న విధానాలు రైతులపై మాత్రమే కాకుండా దిగువ మధ్యతరగతి, మధ్యతరగతి వర్గాలపై కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. ఎందుకంటే ఆహార ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తుల నుండి లాభాలు ఆర్జించడానికి దారితీస్తుంది. దీనివల్ల కొత్తగా మధ్యవర్తులు ఆవిర్భవిస్తారు. ఫలితంగా అన్ని ఆహార పానీయాలు మరింత ఖరీదవుతాయి. అదే సమయంలో బిజెపీ ఈ కంపెనీల నుండి విరాళాలను కూడా సేకరిస్తుంది. దీనివలన ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మరింత పెరుగుతాయి. క్రమంగా ఇది మన రైతుల వ్యవసాయాన్ని, వారి ఆదాయాన్ని తగ్గిస్తుంది. వారి భూమిని ధనవంతులకు, కార్పొరేషన్లకు అమ్మవలసి వస్తుంది. భూమిని స్వాధీనం చేసుకోవమే బిజెపి, వారి మిత్ర పక్షాల అంతిమ లక్ష్యం అని అఖిలేష్ ఎక్స్‌లో తీవ్రంగా విమర్శించారు.

# విఎస్ఆర్ కంపెనీకి విమానయానశాఖ షాక్

**అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డిజిసిఎ దర్యాప్తు**
**బ్యాలెన్స్ షీ, లాగ్ బుక్‌ను చెక చేయనున్న అధికారులు**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) దర్యాప్తును ముమ్మరం చేసింది. వీఎస్ఆర్ వెంచర్స్‌పై స్పెషల్ ఆడిట్‌కు ఆదేశించింది. ఫిబ్రవరి 15వ తేదీలోగా ఆడిట్ పూర్తి చేసే అవకాశం కనిపిస్తోంది. ఆడిట్‌లో భాగంగా వీఎస్ఆర్ కంపెనీకి చెందిన బ్యాలెన్స్ షీట్స్, లాగ్ బుక్స్‌ను అధికారులు చెక్ చేయనున్నారు. ఈ చెకింగ్స్ ద్వారా ప్రమాదానికి గురైన విమానానికి సంబంధించిన మెయిన్‌టెన్స్ వివరాలు తెలుసుకో నున్నారు. ప్రోటోకాల్ ప్రకారం లాగ్ బుక్ ఫిల్ చేస్తున్నారా? లేదా గుర్తించనున్నారు. మరో వైపు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) కూడా ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తోంది. కాగా, అజిత్ పవార్ లియర్‌జెట్ 45NF విమానంలో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. ఈ లియర్‌జెట్ 45NF విమానం వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినది. విమానాలను అ÷-దదెకు ఇచ్చే అతి పెద్ద సంస్థలలో వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా ఒకటి. ప్రమాదం జరిగిన తర్వాత సంస్థ యజమాని వీకే సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'నా దగ్గర ఉన్న విమానాలు అన్నీ చాలా మంచి కండీషన్‌లో ఉన్నాయి. అలాంటి వాటిని ఎందుకు నిలిపివేస్తాను. లియర్‌జెట్ విమానాలకు ప్రపంచవ్యాప్తంగా మంచి పేరుంది. అలాంటి వాటిని నేను కచ్చితంగా నిలిపివేయను' అని స్పష్టం చేశారు. అజిత్ అనంతరావు పవార్ జనవరి 28వ తేదీన బారామతిలో జరిగే ఓ కార్యక్రమానికి వీఎస్ఆర్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన లియర్‌జెట్ 45NF విమానంలో బయలుదేరారు. బారామతి ఎయిర్‌పోర్టు వద్ద విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ల్యాండ్ కావాల్సిన విమానం మళ్లీ గాల్లోకి లేచింది. ఉదయం 8.45 గంటల సమయంలో నేలపై పడి పేలిపోయింది. అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ఈ ప్రమాదంలో చనిపోయారు.


# భవిష్యత్తు యుద్ధాల గురించి సైనిక దళాల స్టడీ

**న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ఆపరేషన్ సింధూర్ యుద్ధ నీతిలో కొత్త పంథాకు తెరలేపింది. టెక్నాలజీ ఆధారంగా యుద్ధం ఎలా చేయాలన్న అనేక విషయాలను ఆ ఆపరేషన్‌లో తెలుసుకున్నారు. అయితే భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలను ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలకు చెందిన బలగాలు ఇప్పుడు తమ ఆధునిక నైపుణ్యాన్ని పెంచుకునే పనిలో పడ్డాయి. దీనిలో భాగంగానే ఢిల్లీలోని మానెక్‌షా కేంద్రంలో యుద్ధ కోర్సును ప్రారంభించాయి. యుద్ధ టెక్నాలజీలో వస్తున్న మార్పులు, దానికి అనుగుణంగా ఎలా పటిష్టంగా తయారు కావాలన్న లక్ష్యంతో త్రివిధ దళాలు శిక్షణ మొదలుపెట్టాయి. సుమారు మూడు వారాల పాటు ఆ శిక్షణా కోర్సు జరగనున్నది. యుద్ధాల్లో టెక్నాలజీ ప్రభావం, మూడు దళాల మధ్య సమన్వయం ఎలా కుదుర్చుకోవాలి, స్వదేశీ ఆయుధాల ఉత్పత్తి లాంటి అంశాలపై ఈ స్టడీ జరగనున్నది.రక్షణ పరిశ్రమలు, స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్‌తో పాటు త్రివిధ దళాలకు చెందిన వ్యక్తులు ఈ కోర్సులో పాలుపంచుకుంటున్నారు. త్రివిధ దళాల్లోని మేజర్ ర్యాంకు నుంచి మేజర్ జనరల్స్, జూనియర్ ఆఫీసర్లు తమ టెక్నాలజీ నైపుణ్యాన్ని షేర్ చేసుకోనున్నారు. ఆపరేషనల్ ఎక్స్‌పీరియన్స్‌తో పాటు వ్యవూహాత్మక పరిజ్ఞానాన్ని సీనియర్ ఆఫీసర్లు పంచుకోనున్నారు. మిలిటరీ ఆపరేషన్స్‌లో జరిగే డొమెయిన్ స్పెసిఫిక్ వార్‌ఫేర్ గురించి కోర్సులో నేర్చుకోనున్నారు. వార్‌ఫేర్ కోర్సును నిర్వహించడం ఇది మూడోసారి. అయితే ఆపరేషన్ సింధూర్ తర్వాత ఇలాంటి శిక్షణా తరగతుల్ని నిర్వహించడం మొదటి సారి అవుతుంది. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎక్కువ సంఖ్యలో కొత్త టెక్నాలజీకి చెందిన డ్రోన్లను వినియోగించారు. ఇలాంటి వాటి గురించి తాజా కోర్సులో స్టడీ చేయనున్నారు. ఆధునిక యుద్ధ పరిజ్ఞానాన్ని సమకూర్చుకునేందుకు ఈసారి బడ్జెట్‌లో రక్షణ రంగానికి అధిక నిధులు కేటాయించిన విషయం తెలిసిందే.




# ఎలాన్ మస్క్‌కు ఫ్రాన్స్ సమన్లు

**ఎక్స్ కార్యాలయాల్లో సోదాలు**



**పారిస్ : ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
చిన్నారుల అశ్లీల దృశ్యాలు, డీఫ్‌ఫేక్‌లను వ్యాప్తి చేయడం వంటి ఆరోపణలపై ఫ్రాన్స్ ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా దేశంలోని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ కార్యాయాల్లో మంగళవారం సోదాలు నిర్వహించింది. అలాగే, విచారణ కోసం ఎక్స్ యజమాని, ప్రపంచ ధనవంతుడు ఎలాన్ మస్క్‌కు సమన్లు జారీ చేసింది. ఏప్రిల్ 20న విచారణకు షెడ్యూల్ చేసింది. ఈ వివరాలను ఫ్రాన్స్ ప్రభుత్వం వెల్లడించింది. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో చిన్నారుల అశ్లీల చిత్రాలను పోస్టు చేయడం, వాటిని వ్యాప్తి చేయడంలో సహకరించడం, లైంగికంగా అసభ్యకరమైన డీప్‌ఫేక్‌లు.. వంటి ఇతర నేరాలపై ప్రాసిక్యూటర్ల సైబర్ క్రైమ్ విభాగం దర్యాప్తు నిర్వహిస్తుందని ఫ్రాన్స్ ప్రభుత్వం పేర్కొంది. ఎక్స్ ఉద్యోగులను కూడా విచారించడానికి సమన్లు జారీ చేసినట్లు తెలిపింది. కాగా, అయితే, ఈ సోదాలు, సమన్లుపై ఎక్స్ ఇంకా స్పందించలేదు.

## రాజ్యాంగాన్ని గౌరవించుకుంటే దేశం వీడండి

మొదటి తరువాయి

మా దేశ గోప్యతతో మీరు ఆడుకోలేరు. మా డేటాకు సంబంధించి ఒక్క అంకెను పంచుకోవడానికి కూడా మిమ్మల్ని అనుమతించము' అని అమెరికాకు చెందిన మెటాను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ మందలించారు. దేశ చట్టాలను పాటించకపోతే భారతదేశం విడిచి వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. వాట్సాప్ 2021 ప్రైవసీ పాలసీకి సంబంధించిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తాజాగా విచారించింది. వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగదారుల డేటాను పంచుకోవడం దోపిడీ అని ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దేశంలోని లక్షలాది మంది పేదలు, చదువురాని ప్రజలు ప్రైవసీ పాలసీని అర్థం చేసుకోగలరా అని మెటా ప్రతినిధులను చీఫ్ జస్టిస్ సూటిగా ప్రశ్నించారు .కొన్ని సందర్భాల్లో మెటా పాలసీలు అర్థం చేసుకోవడం తమకే ఇబ్బందిగా మారుతోందని, అలాంటప్పుడు గ్రామీణ భారత దేశ ప్రజలకు ఎలా అర్థం అవుతుందని ప్రశ్నించారు. కాగా, మెటా ఇంజినీరింగ్ బృందం ఇతరుల వాట్సాప్ మెసేజ్‌లను చదవగలదని వాట్సాప్ అంతర్జాతీయ వినియోగదారుల బృందం ఇటీవల అమెరికా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు హెచ్చరికలు మెటాను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయి. కొన్నిసార్లు మెటా విధానాలను అర్థం చేసుకోవడానికి తాము కూడా ఇబ్బందిపడతామన్నారు. ఒకసారి తనకు ఓ వైద్యుడు వాట్సప్‌లో మందుల ప్రిస్క్రిప్షన్ పంపితే.. దానికి సంబంధించిన ప్రకటనలే ఫోన్‌లో కనిపించాయన్నారు. ఇక దేశంలోని లక్షలాదిమంది పేద, చదువురాని ప్రజలు ఈ విధానాలను ఎలా అర్థం చేసుకుంటారని ప్రశ్నించారు.2021 జనవరిలో వాట్సప్ కొత్త ప్రైవసీ పాలసీని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. యూజర్లు వాట్సప్ బిజినెస్ అకౌంట్లతో జరిపే సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని ఫేస్‌బుక్‌తో పంచుకొనేందుకు అనుమతి లభిస్తుంది. కొత్త పాలసీకి అంగీకరించని వారి ఖాతాలను రద్దు చేస్తామని తొలుత హెచ్చరించింది. కానీ, దీనిపై తీవ్రస్థాయిలో ఆందోళన వ్యక్తమైంది. ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని అభ్యంతరాలు వచ్చాయి. దీనిపై జోక్యం చేసుకొన్న కేంద్ర ప్రభుత్వం వెంటనే పాలసీ అమలును నిలిపివేయాలని ఆదేశించింది. ఐటీ చట్టంలోని నిబంధనలకు ఈ కొత్త పాలసీ పూర్తి విరుద్ధంగా ఉందని తేల్చి చెప్పింది. ఈ పాలసీపై దాఖలైన పిటిషన్‌పై తాజాగా విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

## ట్రంప్ ఒత్తడికి ప్రధాని తలొగ్గారు

మొదటి తరువాయి

మన ప్రధాని అమెరికా వత్తిడికి తలొగ్గారని, భారత దేశ ప్రజలు దీని గురించి ఆలోచించాలని, భారతీయ రైతులు ఆ డీల్ గురించి ఆలోచించాలని, మీ శ్రమ, రక్తం, చమటను మోదీ అమ్మేస్తున్నారని ఆరోపించారు. కేవలం రైతులే కాదు. యావత్ దేశాన్ని అమ్మేశారని, అందుకే తనను సభలో మాట్లాడనివ్వడం లేదని రాహుల్ అన్నారునాలుగు నెలలుగా నిలిచిపోయిన భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌పై ఇంత అకస్మాత్తుగా సంతకాలు జరగడంపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు గుప్పించారు. ఈ డీల్ వివరాలు కేంద్రం వెల్లడించాలని డిమాండ్ చేశారు. ట్రంప్ ఒత్తిడితోనే మోదీ ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నారని, దేశాన్ని అమ్మకానికి పెట్టారని, తమ ఇమేజ్ ఎక్కడ దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ వణుకుతున్నారు. భారత్-అమెరికా ట్రేడ్ డీల్ నాలుగు నెలలుగా నిలిచిపోయింది. దానిపై సోమవారం రాత్రి నరేంద్ర మోదీ సంతకం చేశారు. ఆయనపై తీవ్రమైన ఒత్తిడి ఉంది. నరేంద్ర మోదీ ఇమేజ్ దెబ్బతినవచ్చు. రాష్ట్రపతి ప్రసంగంపై ప్రతిపక్ష నేతను మాట్లాడనీయక పోవడం ఇదే మొదటిసారి. ట్రేడ్ డీల్ విషయంలో రాజీపడ్డారు. దేశాన్ని అమ్మేశారు. ఇంతవరకూ మలచుకుంటూ వస్తున్న తన ఇమేజ్ ఇప్పుడు దెబ్బతింటుందోనని మోదీ భయపడుతున్నారు' అని రాహుల్ విమర్శించారు. మోదీ భయపడడానికి కారణాలను రాహుల్ వివరిస్తూ.. 'అదానీపై అమెరికాలో కేసు ఉంది. నిజానికి ఇది మోదీపై కేసు. ఎప్‌స్టీన్ ÷ల్స్‌లో చాలా విషయాలున్నాయి. దానిని అమెరికా ఇప్పటికీ విడుదల చేయలేదు. ఆ ఒత్తిడి కూడా ఉంది. ఒత్తిడికి కారణమవుతున్న రెండు పాయింట్లు ఇవే. దేశం దీనిని అర్థం చేసుకోవాలి' అని అన్నారు.

## రెండోరోజూ ఉభయసభల్లో గందరగోళం

మొదటి తరువాయి

వ్యూహాత్మక చిక్కులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం అధికారిక పకటన చేయలేదు అలాగే పార్లమెంటును విశ్వాసంలోకి తీసుకోలేదని అన్నారు. ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంలో నిబంధనలు, షరతులు దేశ ప్రజలు తెలుసుకునే హక్కు ఉందని, అదేవిధంగా ప్రభుత్వం అన్ని వివరాలను పార్లమెంట్ మరియు దేశ ప్రజల ముందు ఉంచడం అత్యవసరం అని తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అంశం ఆవశ్యకత, ప్రజాప్రాముఖ్యత దృష్ట్యా, ఈ అంశంపై వాయిదా తీర్మానం ద్వారా తక్షణ చర్చకు అర్హత ఉందని పేర్కొన్నారు. భారత్- అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నే స్వయంగా సోషల్‌మీడియా ద్వారా సోమవారం ప్రకటించారు. ఈ అంశంపై మంగళవారం పార్లమెంటు దద్దరిల్లింది. లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రతిపక్ష సభ్యులు ఇటీవల యూరోపియన్ యూనియన్‌తో, తాజాగా అమెరికాతో కుదర్చుకున్న ఒప్పందాలపై చర్చ జరపాలని పట్టుబట్టాయి. దీంతో సభలో గందరగోళం నెలకొంది. రాజ్యసభలో ఈ ఒప్పందాలపై జైరాం రమేష్ చర్చకు లేవనెత్తరు. ఈ విషయంపై రాజ్యసభ స్పీకర్ సి.పి రాధాకృష్ణన్ స్పందించి.. తరువాత చర్చిస్తామని చెప్పి.. సభను మధ్యాహ్నం 12 వరకువాయిదా వేశారు. లోకసభలోనూ ఇదే తీరు నెలకొనడంతో.. దిగువ సభ కూడా మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇకపోతే మాజీ ఆర్మీ జనరల్ ఎంఎం.నరవణెకి చెందిన ఒక పుస్తకం నుడి కొన్ని అంశాలను ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సోమవారం లేవనెత్తిన సంగతి తెలిసిందే. నవరణె ప్రచురించని పుస్తకం నుండి కొన్ని కోట్‌లను ఉపయోగించి కాంగ్రెస్ పార్టీపై తేజస్వీ సూర్య చేసిన ఆరోపణలకు ప్రతిస్పందించేందుకు రాహుల్‌గాంధీ యత్నించారు. ఆయనకు అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడంలో సభలో గందరగోళం నెలకోంది. దీంతో లోక్‌సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది.

## పాలకులే గుండాల్లా..రౌడీల్లా మారారు

**మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం' అని హెచ్చరికలా**
**రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్న టిడిపి నేతలు**
**మండిపడ్డ మాజీమంత్రి విడుదల రజని**



**అమరావతి,**

:వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గట్ చేస్తూ టీడీపీ నేతల సృష్టిస్తున్న అరాచకంపై మాజీ మంత్రి విడదల రజిని మండిపడ్డారు. పాలకులే గూండాల్లా, రౌడీల్లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. 'మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం' అని టీడీపీ నేతలు మాట్లాడటం ఏ సంస్కృతికి నిదర్శనమని ప్రశ్నించారు. ఈరోజు(మంగళవారం, ఫిబ్రవరి 3వ తేదీ) తాడేపల్లి వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యాలయం నుంచి మాట్లాడిన విడదల రజిని.. 'మళ్లీ వస్తాం.. మళ్లీ కొడతాం అని ఎమ్మెల్యే మాధవి బెదిరిస్తున్నారు. ఆమెను టీడీపీ బలిపశువు చేస్తోందని గుర్తుంచుకుంటే మంచిది. మహిళా పక్షపాతి లాగ తెగ బిల్డప్‌లు ఇస్తారు.. మళ్లీ మీరే దాడులు చేస్తారు. కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులు చేయిస్తున్నారు. లడ్డూ ఇష్యూను డైవర్ట్ చేసేందుకు టీడీపీ గూండాలు దాడులు చేస్తున్నారు. మాపై దాడి చేసి తిరిగి మాపైనే కేసులు పెట్టారు. మాపై దాడి చేశారని ఫిర్యాదు చేస్తే.. కనీసం స్పందన లేదు. కూటమి పాలకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని గుడికెళ్లి మొక్కుకుంటే తప్పా. వెంకటేశ్వరస్వామితో పెట్టుకుంటే ఏం జరుగుతుందో మీకు బాగా తెలుసు కదా. వైఎస్సార్‌సీపీ వాళ్లు ఏ గుడికి వెళ్లొద్దని చట్టం చేయండి. తిరుమల లడ్డూ వ్యవహారంలో జరగని కల్తీని జరిగినట్లు దుష్ప్రచారం చేస్తున్నారు. మేము కూటమి నేతలను నిలదీస్తున్నామనే మాపై దాడులు చేస్తున్నారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోంది. రాష్ట్రంలో రాజ్యాంగం లేదు.. ప్రజాస్వామ్యం లేదు.. శాంతి భద్రతలు లేవు. రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలసీ, రెడ్‌బుక్ పాలన నడుస్తోంది. రెడ్‌బుక్ అరాచకంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మీరెన్ని దాడులు చేసినా మేము ప్రజల పక్షాన పోరాడుతాం' అని స్పష్టం చేశారు.

# సూత్రధారులు తేలాలి...

మొదటి తరువాయి

తెలిపారు. తిరుమల లడ్డూలో వాడే నెయ్యిలో కల్తీ జరుగుతోందని తెలిసినా గత వైకాపా పాలకులు మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో వైకాపా హయాంలో వచ్చిన సీఎఫ్‌టీఆర్ నివేదికను కావాలనే తొక్కిపెట్టారని మండిపడ్డారు. నిబంధనలు సడలించి మరీ అక్రమాలకు గేట్లు తెరిచారని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగా తప్పు చేసినందున రిపోర్టులో ఉన్నవారందరికీ నేరంలో భాగం ఉందని
అభిప్రాయపడ్డారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో అసలు సూత్రధారులను తేల్చేందుకు విచారణ కమిషన్ ఏర్పాటు చేయాలని క్యాబినెట్ నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో ఇన్ని తప్పులు జరుగుతుంటే గత ప్రభుత్వ పెద్దలు ఎందుకు మౌనంగా ఉన్నారని పయ్యావుల ప్రశ్నించారు. ఈ తప్పుల్లో వారు భాగస్వాములుగా ఉన్నారని ఆధారాలు చెబుతున్నాయన్నారు. సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నివేదిక సూచనల మేరకు చర్యలు తీసుకోని వారిని ఏమనాలని అన్నారు. కల్తీ నిర్ధారణ పరీక్ష వద్దనగానే సడలింపు ఇవ్వటం నేరాన్ని ప్రోత్సహించటమే అన్నారు. ఏ నేపథ్యంలో



సీఎం చంద్రబాబు మాట్లాడారో గ్రహించాలి. లడ్డూల్లో కొబ్బరి, పందికొవ్వు, పామాయిల్, ఫిష్ ఆయిల్ ఉన్నట్టు ఎన్‌డీడీబీ నివేదిక ఇచ్చింది. ల్యాబ్ నివేదికలోని సమాచారం ప్రకారమే సీఎం మాట్లాడారు. తెలిసిన వాస్తవాలను సీఎం ప్రజల ముందు పెట్టాలా? వద్దా? తితిదే ప్రక్షాళనలో భాగంగా ఈవోగా శ్యామలరావును నియమించారు. నమూనాలను సీఎఫ్‌టీఆర్‌ఐకి అప్పటి ఈవో పంపించారు. 2022లో నివేదిక ఇస్తే దాన్ని సరిచేయకుండా ముందుకెళ్లారు. పాలసేకరణలో 3 నిబంధనలు పెట్టారు. 4లక్షల లీటర్ల పాలు సేకరించే సంస్థగా ఉండాలని నిబంధన ఉంది. సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న భోలే బాబా డెయిరీకి వెళ్లారు. నకిలీ పత్రాలతో టెండర్లలో పాల్గొన్నారని తెలిసినా మౌనం వహించారు. చుక్కపాలు లేకుండా నెయ్యి చేయడంపై ప్రజల్లో చర్చ జరగాలి. నేరంలో భాగస్వాములపై చర్యలు తీసుకునేందుకే విచారణ కమిషన్. బ్రిటీష్ పాలకులు, నిజాం కూడా తిరుమల వ్యవస్థలోకి చొరబడలేదని పయ్యావుల అన్నారు. తిరుమల కల్తీ లడ్డూ వ్యవహారంలో పారదర్శకత కోసమే ప్రభుత్వ ప్రయత్నం తప్ప.. రాజకీయ కోణం ఇందులో లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుమల శ్రీవారి పవిత్రత కాపాడే ప్రయత్నమే కూటమి ప్రభుత్వం చేస్తోందన్నారు. తిరుమల లడ్డూలో కల్తీని వైకాపా సమర్థిస్తోందా అని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రశ్నించారు. 250కోట్ల అవినీతి కోసం భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. హిందూధర్మం మూలాలను దెబ్బతీసే విధంగా వైకాపా చర్యలు ఉన్నాయని దుయ్యబట్టారు

# భారత్ రష్యా వ్యూహాత్మక భాగస్వామి

మొదటి తరువాయి

పేర్కొన్నారు. పశ్చిమ దేశాల నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నప్పటికీ, భారత్ ఎప్పుడూ తన దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తుందని, స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుందని రష్యా విశ్వాసం వ్యక్తం చేసింది.ఇటీవల మోదీతో జరిపిన ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ ప్రస్తావిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలును పూర్తిగా నిలిపివేస్తామని మోదీ తనకు మాటిచ్చారని ట్రంప్ ప్రకటించారు. తాము జరిపిన చర్చలు సఫలమయ్యాయని, ఇది అమెరికా సాధించిన గొప్ప విజయమని ఆయన అభివర్ణించారు. అయితే ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది గంటల్లోనే రష్యా నుంచి ఈ వివరణ రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ వ్యాఖ్యలపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. భారత్ వంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోందని పెస్కోవ్ ఆరోపించారు. వాషింగ్టన్ నుంచి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నా న్యూఢిల్లీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోందని ప్రశంసించారు. ఇంధన భద్రత విషయంలో భారత్ తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ ప్రజల అవసరాలకు అనుగుణంగానే ఉంటాయని రష్యా బలంగా నమ్ముతోంది. ఇరు దేశాల మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని, ఎలాంటి మార్పులు ఉంటే దౌత్య మార్గాల్లో సమాచారం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో, భారత్ తక్కువ ధరకు రష్యా ముడి చమురును భారీగా దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ చమురు అవసరాల్లో దాదాపు 40 శాతం రష్యా నుంచే తీరుతున్నాయి. ఈ వాణిజ్యం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడంతో పాటు, రష్యాకు కూడా ఆదాయం లభిస్తోంది. ఈ నేపథ్యంలో చమురు కొనుగోళ్లు ఆపేయడం అంత సులభం కాదని, ఇది కేవలం ట్రంప్ రాజకీయ విన్యాసాల్లో భాగం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఏపిలో రెడ్ బుక్ రాజ్యాంగం

మొదటి తరువాయి


ఎదుట ధర్నా చేపట్టింది. మంగళవారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్లకార్డులతో ఆందోళనకు దిగారు. ఏపీ శాంతి భద్రతల వ్యవహారంలో జోక్యం చేసుకోవాలని.. అవసరమైతే రాష్ట్రపతి పాలన విధించాలని నినాదాలు చేశారు. ఇళ్లు, కార్లు తగులబెట్టడం, తప్పుడు కేసులు నమోదు చేసి వేధించడం వంటి దుశ్చర్యలు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. రాజ్యాంగ పాలనకు బదులు సొంతంగా రూపొందించుకున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'ను అమలు చేస్తున్నట్లుగా పరిస్థితి మారిందని, దీనివల్ల ప్రజలకు, ప్రతిపక్షాలకు న్యాయం పూర్తిగా దూరమైందని తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్, విడదల రజిని ఇళ్లపై జరిగిన దాడులను ప్రస్తావిస్తూ, ఇవి కూటమి ప్రభుత్వ ప్రతీకార రాజకీయాలకు స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని, పోలీసులు నిస్సహాయ స్థితిలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ పరిస్థితిపై ప్రధాని, కేంద్ర హోం మంత్రి వెంటనే జోక్యం చేసుకుని ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన బాధ్యత తీసుకోవాలని వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు డిమాండ్ చేశారు.ఏపీలో ఆటవిక పాలన కొనసాగుతోంది. ప్రతిపక్ష నేతల ఇళ్లపై దాడులు పరిపాటిగా మారాయి. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి. శాంతి భద్రతలను పరిరక్షించాలి. రాష్ట్రపతి పాలన విధించాలి అని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కేంద్రాన్ని కోరారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతీకార రాజకీయాలు మొదలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని.. అక్రమ కేసులు, అరెస్టులు చేయించడమే కాదు.. హత్యలకూ పాల్పడుతున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా వదలడం లేదు. ఈ క్రమంలోనే.. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ నివాసాలపై అధికార టీడీపీ దాడులు చేసింది. ఈ జంగిల్ రాజ్‌పై చట్టబద్ధంగా, అహింసా పద్ధతుల్లో వైస్సార్‌సీపీ పోరాటాన్ని ప్రారంభించింది. ఇప్పటికే ఈ పరిస్థితులను కేంద్ర హోం శాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లింది వైఎస్సార్‌సీపీ. త్వరలో హోంమంత్రి అమిత్ షాను కలసి పరిస్థితులను ఆయనకు వివరించాలని భావిస్తోంది.

## సంయమనంతో టిడిపి కార్యకర్తలు

**రెచ్చగొట్టినా రెచ్చిపోకుండా బాబు కంట్రోల్**
**వైసిపి ఉచ్చులో పడకుండా చూసుకుంటున్నాం**
**హోంమంత్రి వంగలపూడి అనిత**

**అమరావతి,**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనకు ఎలాంటి పొంతన లేదని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన



చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గత రెండు రోజుల్లో జరిగిన పరిణామాలను ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీ కార్యకర్తల కోపాన్ని అదుపు తప్పకుండా సంయమనం పాటించేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. నాయకులకు వాస్తవాలను వివరించి, రాష్ట్రాభివృద్ధి లక్ష్యాలను గుర్తు చేసి.. వైసీపీ ఉచ్చులో పడకుండా నియంత్రించామన్నారు హోంమంత్రి. టీడీపీ కార్యకర్తలను గత 20 నెలలుగా పూర్తి అదుపులో పెట్టాం కాబట్టే రాష్ట్రంలో మంచి వాతావరణం నెలకొందని తెలిపారు. కార్యకర్తల కడుపు మంటను అర్థం చేసుకున్నప్పటికీ, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా సరైన సమయంలో హితబోధ చేసిన నాయకుడు చంద్రబాబు అని అనిత కొనియాడారు. గతంలో 'బోసు డీకే' అనే పదానికి బూతు సృష్టించి టీడీపీ కార్యాలయంపై జగన్ దాడి చేయించారని గుర్తుచేశారు. ఆ పదానికే తన కార్యకర్తలకు బీపీలు వచ్చాయని జగన్ సమర్థించుకున్నారని మంత్రి తెలిపారు. వైసీపీ నేతలు అసభ్య పదజాలంతో దూషిస్తుంటే కూడా తమ అధినేత ఇప్పటికీ సంయమనం పాటించమని సూచిస్తున్నారని హోంమంత్రి అన్నారు. హింసను, విధ్వంసాన్ని ప్రోత్సహించి ప్రజలను జగన్ భయభ్రాంతులకు గురిచేశారని విమర్శించారు. బూతులు, హింసాత్మక చర్యలతో వైసీపీ నేతలను ప్రోత్సహించారే తప్ప ఏనాడైనా తప్పని చెప్పారా అంటూ జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఒక క్రిమినల్ ఆలోచనా విధానాలను, విజనరీ ఆలోచనలను అర్థం చేసుకున్నారని అన్నారు. క్రిమినల్ ఆలోచనలతో రాష్ట్రంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ యత్నిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పు చేయాలనే ఆలోచన రావాలంటేనే భయపడేలా రాజకీయ రౌడీలకు పోలీసు ట్రీట్మెంట్ ఇస్తామని మంత్రి అనిత వార్నింగ్ ఇచ్చారు.

## మన సహనమే విజయానికి బాట

మొదటి తరువాయి

ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు.



మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు. భారత్‌పై అమెరికా విధించిన సుంకాలపై ఎన్ని విమర్శలు వచ్చినా.. సహనంతో ఉన్నానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆ సహనమే ఇప్పుడు దేశానికి మంచి ఫలితాలను తీసుకుని వచ్చిందన్నారు. అగ్రరాజ్యంతో చేసుకుంటున్న ఈ ఒప్పందం అనుకూలమైన ఆర్థిక వాతావరణాన్ని సృష్టించిందని వెల్లడించారు. వాణిజ్య చర్చలపై ప్రభుత్వ స్థిరమైన వైఖరికి ఇది నిదర్శనమన్నారు. ప్రపంచ దేశాల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల వల్ల ఎన్నో దేశాలు వాణిజ్యపరంగా సమస్యలు ఎదుర్కొంటు న్నప్పటికీ.. భారత్ మాత్రం ప్రయోజనం పొందుతోందన్నారు. దేశంలో పారిశ్రామిక వృద్ధిని బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని మోదీ పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికాతో జరుగుతున్న వాణిజ్య చర్చల్లో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వెనకడుగు వేయలేదన్నారు. గత దశాబ్దకాలంలో దేశంలో చాలా మార్పులు వచ్చాయని, పలు సంస్కరణలు మంచి ఫలితాలను ఇచ్చాయని తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతోన్న ఆర్థికవ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందని.. ప్రపంచ వేదికలపై మన ప్రాబల్యం పెరిగిందని వెల్లడించారు. మరికొన్నేళ్లలో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్ తప్పకుండా నిలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. పార్లమెంట్ కార్యకలాపాలకు ముందు ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సన్మానించారు.

# సంపాదకీయం

## ఎపిలో కల్తీ నెయ్యి మంటలు !




తిరుమల కల్తీ నెయ్యి రాజకీయంతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు పరాకాష్టకు చేరాయి. విమర్శలు, ప్రతి విమర్శలు కాస్తా దాడుల వరకు పోయాయి. పరస్పర విమర్శలు కూడా హద్దులు దాటాయి. ఇళ్లను తగులబెట్టడం, ఇళ్లపై దాడులు చేయడం వంటి దారుణాలు చూస్తున్నాం. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇలాంటివి చూశాం. ఇప్పుడు చంద్రబాబు పాలనలోనూ ఇలాంటివి చోటు చేసుకోవడం సిగ్గుచేటు. రాజకీయంగా ఎన్ని విమర్శలు చేసినా ఫరవాలేదు. కానీ దాడులకు తెగించడం మాత్రం సరికాదు. జోగిరమేశ్ ఇంటిపై పెట్రో బాంబు విసిరి తగులబెట్టే యత్నం చేయడం వాంఛనీయం కాదు. అలాగే అంబటి రాంబాబు ఇంటిపైనా దాడిచేసి కారును, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. గతంలో నెల్లూరు జిల్లాలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపైనా దాడికి తెగించారు. ఇదంతా ప్రజాస్వామ్యంలో వాంఛనీయం కాదు. ఇలాంటి దాడులతో ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారో కూటమి నేతలు చెప్పాలి. ఓ రకంగా చెప్పాలంటే తిరుమల లడ్డూకు సంబంధించి కల్తీనెయ్యి సరఫరా వ్యవహారంలో తాజాగా సిబిఐ ఇచ్చిన నివేదక ఆజ్యం పోసిందని చెప్పాలి. కల్తీ జరగలేదని సిబిఐ చెప్పినట్లుగా వైసిపి నేతలు చేస్తున్న ప్రచారం కూడా పరాకాష్టకు చేరింది. తిరుమల దేవదేవుడిని మోసం చేయడంలో అందరూ ముందున్నారు. తిరుమల శ్రీవారిని దోచుకునేందుకు అందరూ ప్రయత్నించారు. దేవుడి డబ్బుపై కన్ను పడిన వైకాపా అక్కడ చేయని ఘోరం లేదు. ఇకపోతే కల్తీనెయ్యిపై విచారణ సాగుతోంది. సిట్ అన్నింటిని పరిగణించి దర్యాప్తు చేస్తోంది. తాజాగా ఇవో అనిల్ కుమార్ సింఘాల్‌ను కూడా బదిలీ చేశారు. అయితే ఈ వ్యవహారంలో పరస్పర దూషణలు, దాడుల వరకూ వెళుతున్న తీరు మాత్రం సభ్యసమాజం సిగ్గుపేడేలా చేసింది. అసలు కల్తీ తీవ్రతపైన సిబిఐ వెల్లడించిన విస్తృతాంశాలను వదిలేసి ఒక్క అంశమే తీసుకుని తాము నిర్ధోషులమని చెప్పుకోవడానికి వైసిపి నేతలు రెచ్చిపోయి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారి తీసిందని చెప్పాలి. అలాగే మాజీ సిఎం జగన్ కూడా తిరుమల వ్యవహారాన్ని చాలా చిన్నదిగా చేసి మాట్లాడిన తీరు కూడా సగటు భక్తుడి మనోభావాన్ని దెబ్బతీసింది. ఈ రెండు పార్టీల కుమ్ములాటల్లో ప్రజాసమస్యలన్నీ పక్కదోవ పట్టడం రోజూ చూస్తున్నాం. రాష్ట్రంలో ఎవరు అధికారంలో వున్నా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. ఇది సహజంగా మారింది. కానీ కల్తీ నెయ్యి అంశం మాత్రం భక్తుల మనోభావాలను దెబ్బతీసిందన్నది నిజం. వేలకోట్లకు అధిపతిగా ఉన్న దేవదేవుడి లడ్డూ ప్రసాందం కల్తీనెయ్యితో తయార య్యిందన్న వార్త ఇప్పటికీ జీర్ణించుకోలేనిదిగా మారింది. గతంలో ఆనాటి ప్రధానార్చకులు రమణదీక్షితులు పింక్ డైమండ్లు మాయం అయ్యాయని అన్నారు. ఆలయ భూములు, పూజా పద్ధతులు, నియామకాలతో సహా చాలా సమస్యలు వివాదం అయ్యాయి. వైకాపా హయాంలో తిరుమల పవిత్రతను దెబ్బతీయడం వంటి ఆరోపణలు ముందుకొచ్చాయి. 2024 మేలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి తొలిసారి తిరుమల సందర్శనలోనే అన్నీ ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా శ్యామలరావును నియమించారు. ఆ తరవాత తిరుమల లడ్డూ కోసం ఉపయోగించే నెయ్యిలో 'జంతువుల కొవ్వును వాడే పరిస్థితికి వచ్చారని' ఆరోపించడంతో దుమారం చెలరేగింది. జంతువుల కొవ్వు, పంది కొవ్వు కలిసినట్టు తేలిందని ప్రకటించడమేగాక టిటిడి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రభుత్వం సిట్‌ను నియమించడం, నెలాఖరుకల్లా సిట్ రంగంలోకి దిగి దర్యాప్తు మొదలెట్టడం జరిగి పోయాయి. ఈ క్రమంలో మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చంద్రబాబు నియమించిన సిట్‌తో కాకుండా సిబిఐ విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో కేసు వేశారు. విచారణ జరిపిన సుప్రీం కోర్టు ఏ దర్యాప్తు లేకుండా లడ్డూలో కొవ్వు కలిసిందని ఆరోపించి భక్తుల మనోభావాలను దెబ్బ తీయడమేమిటని తీవ్రంగా ఆక్షేపించింది. దేవుడిని రాజకీయాల్లోకి లాగవద్దని హితవు చెప్పింది. సిబిఐ మొత్తం 12 రాష్ట్రాల్లో అనేక మందిని విచారించింది. ఛార్జిషీటులో 36 మందిని నిందితులుగా పేర్కొంది. ఉత్తరాఖండ్‌లోని భోలే బాబా డెయిరీ నడిపే విపిన్ జైన్, పోమిల్ జైన్‌లను ప్రధాన కారకులుగా తేల్చింది. మొత్తం మీద రాజకీయంగా పాలక పార్టీలు ఏవైనా కొండ మీద అవినీతి సాగుతున్నదని దీన్నిబట్టి తెలుస్తున్నది. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, అసలది నెయ్యి కాదని తేల్చి చెబుతూనే కొవ్వు కలిపారనడానికి ఆధారం లేదని సిబిఐ నిర్ధారించడంతో యుద్ధం మొదలయ్యింది. తాము పరిశీలించిన నమూనాలలోనిజమైన నెయ్యి చాలా తక్కువగా వుందనీ, పామాయిల్, పామ్‌స్టెయిన్, ఇతర కృత్రిమ పదార్థాలు రసాయనాలు కలిపారని స్పష్టం చేసింది. కొవ్వు కలిపినట్టు చెప్పే అవకాశాలు దాదాపు లేవని, పంది కొవ్వు కలిపిన ఛాయలు అసలే లేవని పేర్కొంది. భోలే బాబా డెయిరీ పాలు, నెయ్యి సేకరించిన దాఖలాలే లేవనీ, మొత్తం కల్తీ కృత్రిమ నెయ్యి తతంగమేనని దీంతో స్పష్టమయ్యింది. ఇదే తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్న రీతిలో ఎగిరి గంతేసిన వైసిపి నేతలైతే జగన్‌తో సహా తమ తప్పే లేనట్టు మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్త హోమాలు, ఆలయ సందర్శనలు చేపట్టారు. ఫ్లెక్సీల పంచాయితీలు తిట్ల స్థాయికి దిగజారుతున్నాయి. నెయ్యిలో కొవ్వు లేదన్నది నిజమేగానీ, అందులో రసాయనాలు కలిపి నెయ్యి పేరిట 200 కోట్ల రూపాయల పైన సరఫరా చేయడం మాత్రం నిజం అన్నది ఇక్కడ గమనించాలి. కల్తీ జరిగిందన్నది కూడా నిజం. ఎవరు అధికారంలో ఉన్నా తిరుమలలో దారుణాలు సాగుతున్నాయి. అయితే ఇవన్నీ రాజకీయ విమర్శలను పరాకష్టకు చేర్చాయి. చివరాఖరుకు దాడుల వరకు వెళ్లాయి. ఇలాంటివి జరగడం సరికాదు. రేపు మరోకరు అధికారం లోకి వస్తే మరిన్ని దాడులు జరగవని చెప్పలేం. అందువల్ల ఇలాంటి దాడి రాజకీయాలను తిప్పి కొట్టాల్సిందే. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి.

# రష్యా నుంచి కొనుగోళ్లు తగ్గిస్తామని భారత్ హామీ ఇచ్చింది

### అందుకే ట్రేడ్ డీల్ కు అంగీకరించాం అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహమ్ వెల్లడి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** : ఎట్టకేలకు భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరింది. దీనిపై అటు అమెరికా, ఇటు ఆసియా రాజకీయ, వాణిజ్య వ్యవహారాల పరిశీలకులు, ప్రజా ప్రతినిధులు కీలకమైన విశ్లేషణలు చేశారు. ఈ డీల్‌కు దారితీసిన పరిస్థితులు, కారణాలను వారు లోతుగా విశ్లేషించారు. రష్యా నుంచి ఆయిల్ కొనే దేశాలపై 500 శాతం సుంకాలను బాదాలనే వివాదాస్పద బిల్లును ప్రతిపాదించిన అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహమ్ కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తామనే స్పష్టమైన హామీని భారత్ ఇవ్వబట్టే, ట్రేడ్ డీల్‌కు ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ పచ్చజెండా ఊపారని ఆయన అన్నారు. ఉక్రెయిన్‌పై ఎడతెరిపి లేని దాడులు చేస్తున్న రష్యాకు అతిపెద్ద ఆదాయ వనరుగా మారిన భారత్ లాంటి కస్టమర్‌ను దూరం చేయడంలో ట్రంప్ సఫలం అయ్యారన్నారు. మొత్తం మీద భారత్‌తో ట్రేడ్ డీల్, రష్యా – ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే విషయాల్లో ట్రంప్ ప్లాన్ సక్సెస్ అయిందని గ్రాహమ్ కొనియాడారు. ఈమేరకు ఎక్స్ వేదికగా ఆయన ఒక ట్వీట్ చేశారు. అమెరికా ప్రెసిడెంట్ భారీ సుంకాలను ప్రకటించినా, భారత్ చాలా సంయమనంతో వ్యవహరించిందని కొనియాడారు. ఈ విషయంలో భారత్‌ను ఇతర దేశాలు అనుసరించొచ్చన్నారు. భారత్ తన ప్రవర్తనా విధానంతో సుంకాల తగ్గింపు కంటే ఎక్కువగా మంచిపేరును సంపాదించిందని లిండ్సే గ్రాహమ్ కితాబిచ్చారు. రష్యా నుంచి చమురును కొంటున్న మిగతా పెద్ద దేశాలు రాబోయే రోజుల్లో భారత్‌ను అనుసరిస్తాయనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిడి పెరిగితేనే ఉక్రెయిన్‌తో శాంతి చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రాధాన్యం ఇస్తారన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తగ్గిస్తామని ఇప్పుడు భారత్ తీసుకున్న నిర్ణయం అనేది ఆ దిశగా పడిన కీలక ముందడుగు లాంటిదన్నారు. "భారత్‌తో ట్రేడ్ డీల్ కుదుర్చుకున్నందుకు ప్రెసిడెంట్ ట్రంప్?నకు అభినందనలు. అమెరికాకు అత్యంత ఆప్తదేశం భారత్. దానితో వాణిజ్య అవరోధాలు తొలగినందుకు సంతోషంగా ఉంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనాను ఎదుర్కొనేందుకు అమెరికాకు భారత్ సహాయం అవసరం. కొత్త డీల్‌లో భాగంగా అమెరికా చమురును భారత్ కొంటుంది. రష్యాతో చమురు అనుబంధాన్ని తగ్గిస్తుంది. దీనివల్ల ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధాన్ని ఆపొచ్చు" అని పేర్కొంటూ అమెరికా సెనెట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ జిమ్ రిష్ ట్వీట్ చేశారు. "ఇకపై భారత్‌కు మరిన్ని వ్యవసాయ ఉత్పత్తులను అమెరికా రైతులు ఎగుమతి చేయొచ్చు. అతిపెద్ద భారత మార్కెట్ వల్ల గ్రామీణ అమెరికాకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది. జనాభా పెరుగుతుండటం అనే అంశం భారత మార్కెట్‌ను మరింత ఆకర్షణీయంగా మారుస్తోంది. కొత్తగా కుదిరిన ట్రేడ్ డీల్ అమెరికాకు ప్రయోజనకరం. ప్రత్యేకించి మా వ్యవసాయ రంగానికి కలిసొస్తుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్‌తో ట్రేడ్ చేసి 1.3 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును అమెరికా ఎదుర్కొంది. ఇకపై ఈ లోటు తగ్గుతుంది" అని అమెరికా వ్యవసాయ శాఖ మంత్రి బ్రూక్ రోలిన్స్ పేర్కొన్నారు. "భారత్‌తో అమెరికా ట్రేడ్ డీల్ కుదరడం సంతోషకరం. ఇందుకోసం ప్రెసిడెంట్ ట్రంప్‌ను 'డీల్ మేకర్ ఇన్ చీఫ్' అని పిలవొచ్చు. చమురు డీల్స్ ద్వారా అమెరికాపై సిరుల వర్షాన్ని ట్రంప్ కురిపిస్తున్నారు. దేశానికి భారీ పెట్టుబడులు వస్తున్నాయి. భారత్‌తో ఇంధన దౌత్యాన్ని నెరపడంలో ట్రంప్ సక్సెస్ అయ్యారు. అంతర్జాతీయ సంబంధాలు ఈ విధంగా బలోపేతం అయితేనే అమెరికా వికసిస్తుంది" అని అమెరికా హోం, ఇంధన వ్యవహారాల శాఖల మంత్రి డౌగ్ బుర్గమ్ తెలిపారు."ట్రేడ్ డీల్‌పై అమెరికాతో చర్చలు జరిపే క్రమంలో భారత్ వ్యవహరించిన తీరు భేష్. భారత్ చాలా ఓపికగా ఆచితూచి పావులు కదిపింది. ఏ తరుణంలోనూ అమెరికాతో ఉద్రిక్తతలు పెరిగే అవకాశాన్ని ఇవ్వలేదు. అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు తమ మార్కెట్‌లోకి ఎంట్రీని ఇవ్వలేమని భారత్ తేల్చి చెప్పింది. కానీ వాణిజ్య లోటుకు తావు ఇవ్వని, ట్రేడ్ డీల్‌ను మాత్రమే కుదుర్చుకుంటామని అమెరికా ప్రభుత్వం వాదించింది. దీంతో ఏటా దాదాపు 500 బిలియన్ డాలర్ల విలువైన అమెరికా వ్యవసాయ, టెక్నాలజీ, ఇంధన ఉత్పత్తులను కొనేందుకు భారత్ అంగీకరించింది. వస్తు,సేవల ఎగుమతిపరంగా తనకు అత్యంత ముఖ్యమైన అమెరికా మార్కెట్ కోసం భారత్ వ్యూహాత్మకంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు ప్రతిగా భారత్‌పై విధించిన 25 శాతం సుంకాన్ని 18 శాతానికి తగ్గిస్తామని అమెరికా ప్రకటించింది" అని అమెరికాకు చెందిన వాణిజ్య వ్యవహారాల అధ్యయన సంస్థ సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్ (సీఎస్ఐఎస్)కు చెందిన నిపుణులు రిచర్డ్ రోసో విశ్లేషించారు.

# లోక్‌సభలో చైర్‌పై పేపర్లు విసిరేసిన 8 మంది ఎంపీల సస్పెన్షన్



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** లోక్‌సభ లో 8 మంది ఎంపీలను సస్పెండ్ చేశారు. పేపర్లు చింపి చైర్‌పై విసిరేసిన ఘటనలో ఈ చర్య తీసుకున్నారు. చైర్‌లో దిలీప్ సైకియా ఉన్న సమయంలో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీలు తమకు మైక్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ పేపర్లను చింపి విసిరేశారు. సస్పెండ్ అయిన వారిలో మానికం ఠాగూర్, గురీత్ ఓజ్లా, రాజా వారింగ్, ఎబి ఈడెన్, కిరణ్ రెడ్డి, వెంకట్ రామన్ ఉన్నారు. చైర్‌పై పేపర్లు విసిరేయడాన్ని స్పీకర్ ఖండించారు. పార్లమెంటరీ హుందాతనాన్ని ఉల్లంఘించినట్లు అవుతుందని అన్నారు. బడ్జెట్ సెషన్‌లో ఇలాంటి ఘటనలను ఉపేక్షించలేమన్నారు. 8 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన తర్వాత లోక్‌సభను బుధవారానికి వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సమస్యలను లేవనెత్తే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, సభ అందరిదని, చర్చలు జరగాలని, కానీ సభా వ్యవహారాలను అడ్డుకోవడం సరికాదు అని, నిరసన పేరుతో సభా నిర్వహణను స్తంభింపచేయడం కుదరదని దిలీప్ సైకియా అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ తప్పుపట్టారు. ప్రతి సభ్యుడిని మాట్లాడే హక్కు ఉందని, వారి ఆందోళనలను వినిపించుకోవాలని ఆమె అన్నారు. ఎంపీలను సస్పెండ్ చేయడం దారుణమన్నారు.

# కేంద్ర బడ్జెట్‌తో తమిళ ప్రజలకు తీవ్ర నిరాశ

### ఎన్నికల్లో బిజెపికి గుణపాఠం తప్పదు : స్టాలిన్



**చెన్నై ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ తమిళనాడు ప్రజలకు తీవ్ర నిరాశ కలిగించిందని, ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు గుణపాఠం తప్పక చెబుతారని ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ మంగళవారం పునరుద్ఘాటించారు. మంగళవారం తన కొలత్తూరు నియోజకవర్గంలో దాదాపు రూ 12 కోట్ల వ్యయంతో నిర్మించిన రక్త శుద్ధి విభాగంతో కూడిన బహుళ అంతస్తుల భవనాన్ని స్టాలిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులు బడ్జెట్‌పై అడిగిన ప్రశ్నకు స్టాలిన్ సమాధానం ఇస్తూ 'నేను ఇది వరకే చెప్పాను. కేవలం నిరాశే ఎదురైంది. ఏదైనా మార్పు ఉంటుందని మేం ఆశించాము. ఎలాంటి మార్పు లేదు. మాకు నిరాశే మిగిలింది' అని చెప్పారు. తమకు కలిగిన నిరాశకు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. అలాగే, తాను ఎవర్నీ శుత్రువులగా భావించనని, వారిని స్నేహితులుగా మాత్రమే చూస్తానని తెలిపారు. కాగా, స్టాలిన్ ప్రారంభించిన బహుళ అంతస్తుల భవనాన్ని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్మించింది. ఈ భవన మొదటి అంతస్తులో ఫిజియోథెరపీ కేంద్రం, రెండో అంతస్తులో కృత్రిమ అవయవాల కేంద్రం, మూడో అంతస్తులో డయాలసిస్ కేంద్రం, నాలో అంతస్తులో రోగుల కోసం వివిధ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. కాగా, ఇదే ప్రాంగణంలో ఆరు రేషన్ దుకాణాలను కూడా ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే, కొలత్తూరు సరస్సు సమీపంలో ఏర్పాటు చేసిన పార్కును కూడా ప్రారంభించారు. అదేవిధంగా విద్యార్థులు, ఇతర లబ్ధిదారులకు పుస్తకాలు, ల్యాప్‌టాప్‌లు తదితరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కె ఆర్ పెరియకరుప్పన్, మా.సుబ్రమణియన్, పికె శేఖర్‌బాబు, చెన్నై మేయర్ ఆర్ ప్రియ, ఎమ్మెల్యేలు తాయగం కవి, ఎ.వెట్రిఅళగన్, జోసెఫ్ శామ్యూల్, ఇతర సీనియర్ అధికారులు పాల్గన్నారు.

# 5న చలో పోతిరెడ్డిపాడుకు రైతులు తరలిరండి

**బనగానపల్లె , ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** ఈనెల 5న వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే చలో పోతిరెడ్డిపాడుకు రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో చలో పోతిరెడ్డిపాడు పోస్టర్ ను మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైసిపి నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ ఓటుకు నోటు కోసమే రాయలసీమ ప్రాంతాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తాకట్టు పెట్టారని విమర్శించారు. తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపించానని ప్రకటించినట్లు తెలిపారు. రాయలసీమ ప్రాంతానికి ఇంత అన్యాయం చేస్తుంటే ,రాయలసీమ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. 800



అడుగుల నుంచే కృష్ణా జలాలను విద్యుత్ పేరుతో తెలంగాణ ప్రభుత్వం తరలిస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి అధికారులు మంత్రులు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు.రాయలసీమ ప్రాంతానికి అన్యాయాన్ని గుర్తించి 800 అడుగుల వద్దనే రాయలసీమ ఎత్తిపోతల పథకానికి నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని తెలిపారు. 3000 కోట్ల రూపాయలతో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిన అపర భగీరథుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. వైసిపి పాలనలో 80% పనులు పూర్తి చేశామని , కేవలం 20 శాతం పనులను కూడా పూర్తి ప్రభుత్వం కూటమి పూర్తి చేయలేక చేతులు వచ్చేసిందని విమర్శించారు .రాయలసీమ కు జరుగుతున్న అన్యాయం గురించి వైఎస్ఆర్సిపి పార్టీ ఉద్యమం ద్వారా ప్రజల్లోకి వెళ్తుందని, ఈనెల 5వ తేదీన పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినా పోతిరెడ్డిపాడు కు వెళ్లి తిరుతామన్నారు.రాయలసీమ ప్రాంత ప్రయోజనాల కోసం వైఎస్ఆర్సిపి తరుపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, నాయకులుబివి నాగార్జున రెడ్డి, డి. చిన్నబాబు, చిక్కేపల్లి ప్రసాద్ రెడ్డి, శ్రీనివాస నాయక్, కోటపాడు ఈశ్వర్ రెడ్డి, రామ సుబ్బారెడ్డి,కామిని బాలతిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# హత్య చేసిన ముద్దాయిలకు మూడు నెలలో ఉరిశిక్ష విధించాలి..

- -దేశంలో ఎస్సీ ఎస్టీలకు ఫాస్ట్ ట్రాక్ కోర్టును తక్షణమే ఏర్పాటు చేయాలి..
- -దళితుల మాదిగలపై దాడులు జరిగితే సహించేదే లేదు
- -ఏపి.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి సువర్ణరాజ్

**పత్తికొండ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** ఎమ్మార్పీఎస్.ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టిఎం.రమేష్ ను జనవరి 30వ తేదీన దుండగులు కాపు కాచి అతి కిరాతకంగా దారుణంగా హత్య చేసి చంపిన ముద్దాయిలకు తక్షణమే ఉరిశిక్ష విధించే విధంగా పోలీస్ యంత్రాంగం చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి సువర్ణ రాజు డిమాండ్ చేశారు.మంగళవారం మద్దికేర మండలంలో ఎమ్మార్పీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ ఆల్ ఇండియా రాష్ట్ర కో-కన్వీనర్ రామకొండ వెంకటేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధులుగా దాసరి సువర్ణ రాజు మాదిగ హాజరై వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దళితులపై రోజురోజుకు దాడులు పెట్టిగిలిపోయి రెండు సంవత్సరాల కాలపరిమితిలోని చిప్పగిరి.ఆదోని.



కర్నూలు.ఎమ్మిగనూరు ప్రాంతాలలో అగ్రవర్ణ కులాలవారు దళితులను అతి దారుణంగా హత్య చేశారని మండిపడ్డారు. అందుచేత దేశంలో ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ఏ రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న దళిత నాయకులపై దళిత మహిళలపై హత్యలు పెరిగిపోయాయని విమర్శించారు.సమాజంలో జరిగే అక్రమాలపై ప్రశ్నించే గొంతుక తుగ్గలి మండలం బొందిమడుగుల గ్రామానికి చెందిన టి.ఎం.రమేష్ ను దుండగులు పక్కా ప్లాన్ ప్రకారం కాపుకాచి,ట్రాక్టర్ తో ఢీ కొట్టి,ఇనుప రాడ్లు, బండరాళ్లతో విచక్షణ రహితంగా దాడి చేసి అతి దారుణంగా హత్య చేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.రమేష్ హత్య వెనకాల కొంతమంది రాజకీయ పెద్దల అండదండలు ఉన్నాయని అన్నారు,రమేష్ ను హత్య చేసిన నిందితులపై సెక్షన్ 120 బి 34,సెక్షన్,149 ల క్రింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.హత్యకు గురైన రమేష్ కుటుంబ సభ్యులకు కోటి రూపాయలు ఎక్స్ గ్రే షియా చెల్లించి,కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా హత్య కాపాడిన రమేష్ ఇంటిని బొందిమడుగుల గ్రామాన్ని జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షించి ఆకుటుంబానికి కావలసిన అవసరాలను నియమించే విధంగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి జిల్లా అధ్యక్షులు సుభాష్ చంద్ర,మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బురుజల పులికొండ మాదిగ,జిల్లా అధ్యక్షులు పారా రాఘవేంద్ర,చిన్న అంజనేయులు,ఆనందు రాముదు,సుధాకర్,ఆస్పరి సంజప్ప నెల్లూరు జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, గోపాలు,వివిధ దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికార దాహంతో ప్రభుత్వం దిగజారిన రాజకీయాలు చేస్తున్నారు


**పత్తికొండ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** కూటమి నేతలు అరాచకాలు,దౌర్జన్యం, దాడులు ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ కూటమి ప్రభుత్వ నాయకులను హెచ్చరించారు.కల్తి నెయ్యి అంశంపై సిట్ లో ఉన్న వాస్తవాలకు విరుద్ధంగా ప్రచారం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి,వై వి సుబ్బారెడ్డి,భుమన కరుణాకర్ రెడ్డి ఫోటోలు తో తప్పుడు అపవాదులు కలిగించే పోస్టులను ఏర్పాటు చేసి ప్రజల్లో భయాందోళనలను సృష్టించేలా టిడిపి నాయకులు ప్రచారం చేస్తున్నారని,అలాంటి నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని



కేసులు నమోదు చేయాలని వైసీపీ శ్రేణులతో కలిసి వచ్చి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ జయన్న కు ఫిర్యాదు ఇచ్చారు. బిసి నాయకుడైన మాజీ మంత్రి జోగి రమేష్,కాపు నేత మాజీ మంత్రి ముంబాటి రాంబాబు ఇళ్లపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ పై నేరుగా దాడి చేయడమేనని అన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కూటమి ప్రభుత్వం ఇలాంటి పనులు చేస్తున్నారని మండిపడ్డారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, సర్పంచులు పూరి శ్రీరాములు, ఆంజనేయ, కేశవరెడ్డి,ప్రభాకర్ రెడ్డి,రహిమాన్ వైసిపి నాయకులు లలితా రామచంద్ర,బనగాని శ్రీనివాసులు,నాగిరెడ్డి, భాస్కర్ నాయక్,పెద్దహుల్తీ నాగరాజు, కారం నాగరాజు,తిప్పయ్య,టిఎండి హుస్సేన్,జిలాన్ భాష,సోమశేఖర్, లాయర్లు ఎల్లారెడ్డి,దామోదర్ ఆచారి, నరసింహ ఆచారి,వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# దట్టమైన పొగమంచు

**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాలను మంగళవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఉదయం 8 గంటలు దాటినా మంచు తగ్గకపోవడంతో ప్రజలు చలికి వణికిపోయారు.



ముఖ్యంగా వృద్ధులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు వాహనదారులు లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణించాల్సి వచ్చింది.

# శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి భక్తుల విరాళం



**బనగానపల్లె, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానానికి సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన బద్దిల శ్రీకాంత్, ఆయన సతీమణి అరుణ , వారి కుటుంబ సభ్యులు ఆలయ అభివృద్ధి కొరకు 25,116/- రూ చందాను ఆలయ కమిటీ చైర్మన్ పి.వి.నాగార్జున రెడ్డి ,డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ల సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు మంగళవారం అందజేశారు.


# మాజీ సర్పంచ్ కుమారుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని



**బనగానపల్లె, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** నియోజకవర్గంలోని కమలపూరి మాజీ సర్పంచ్ తులసిరెడ్డి కుమారున్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు .మంగళవారం నంద్యాల శాంతిరాం హాస్పిటల్ లో సంజామల మండలం కమలపురి గ్రామ మాజీ సర్పంచ్ తులసిరెడ్డి కుమారుడు అనారోగ్య కారణంతో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని హాస్పిటల్ కు వెళ్లి మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరామర్శించారు .

# అనాథలకు సాయంచేస్తే భగవంతునికి సేవచేసినట్లే

- -బూదూరు వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య
- -అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం



**మంత్రాలయం, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** సమాజంలో ఉన్న అనాథలకు సాయంచేస్తే ఆభగవంతునికి సేవ చేసినట్టే అని బూదురు గ్రామ వైసిపి నేత మినిగి బుజ్జిగ జక్కయ్య అన్నారు. మంగళవారం ఆయన బూదూరు స్వగృహంలో ఎమ్మిగనూరులో ఉన్న పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమానికి రూ. 20,000 ఆర్థికసాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలకు సాయంచేస్తే ఆ భగవంతుడు మన కుటుంబాలకు మేలులు చేస్తాడన్నారు.రబోయే కాలంలో తనాశక్తి మేరకు మేరకు సహాయం చేస్తానని అన్నారు.ఇలాంటి సేవ చేసే వారిని ప్రోత్సహించాలన్నారు. ఎమ్మిగనూరులోని పూలే అంబేద్కర్ సొసైటీ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు సింగనేటి నరసన్న, సొసైటీ అధ్యక్షురాలు ప్రతిభా భారతి,సాతర్ల ప్రసాద్ కదిరి కోట సుందర్రాజు సామేల్,లకు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు జక్కయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

# కనీస వేతనం 26,000వేలు ఇవ్వాలి లేబర్ కోర్టు రద్దు చేయాలి.

-సిఐటియు మండల కార్యదర్శి జి. గుంటప్ప.

**గూడూరు ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:** ఆశాలను కార్మికులుగా గుర్తించి కనీసం వేతనం 26 వేలు ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులందరికీ చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాల



పిలుపుమేరకు 2026 ఫిబ్రవరి 12న జరుగుతున్న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మెలో ఆశా కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జి గుంటప్ప, ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు మాధవి, శేషమ్మలు పిలుపునిచ్చారు.

## ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి పూజలు



**మంత్రాలయం ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
కౌతాళం మండల పరిధిలోని ఉరుకుంద లో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి (ఉరుకుందు ఈరన్న) స్వామిని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే కు ముందుగా ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు. అదే విధంగా బుడమలదొడ్డి ఆంజినేయ్య స్వామి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈయనతో పాటు దర్శించుకుని కామవరం మహీంద్రా రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఛలో పోతిరెడ్డిపాడు వాల్ పోస్టర్ విడుదల



**మంత్రాలయం ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయం లో వైఎస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి 5వ తేదిన జరిగే ఛలో పోతిరెడ్డిపాడు వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కార్యక్రమం ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు ఆర్. పురుషోత్తం రెడ్డి తదితరులు ఉన్నారు

## చిట్వేల్‌లో నేడు రెవెన్యూ క్లినిక్



**రైల్వే కోడూరు ప్రతినిధి, ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
తిరుపతి డివిజన్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ బి. రామ మోహన్ ఆధ్వర్యంలో చిట్వేల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నేడు ఫిబ్రవరి 4 (మంగళవారం) మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ క్లినిక్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రెవెన్యూ క్లినిక్‌లో భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, రెవెన్యూ రికార్డుల సవరణ, ఆధార్ సీడింగ్, వారసత్వ దరఖాస్తులు తదితర రెవెన్యూ సంబంధిత అంశాలపై ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి తగిన పరిష్కారాలు సూచించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ బి. రామ మోహన్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా విని త్వరితగతిన పరిష్కరించడమే రెవెన్యూ క్లినిక్‌ల ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు మరియు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొననున్నారు.

## గ్రూప్-2 విజేతలకు ఎమ్మెల్యే భూమా సన్మానం

**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ఆళ్లగడ్డ తాలూకాలో గ్రూప్-2 పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి ఎంపికైన నలుగురిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సన్మానించారు. వారిని ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి కృషి ఇతర యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆదర్శంగా తీసుకొని ఆళ్లగడ్డ తాలూకా నుంచి మరింత మంది యువతీ యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు.

# జిల్లాస్థాయి స్థానిక సంస్థ ఎన్నికల సన్నాహక సమావేశం



**ఎమ్మిగనూరు ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలో బహుజన సమాజ్ పార్టీ కర్నూలు జిల్లా స్థానిక సంస్థల సన్నాహక సమావేశం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర భాయిచార కన్వీనర్ బోయ రవికుమార్ పాల్గొన్నారు . జిల్లా ఇన్చార్జి గాడి అరుణ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గుడిపి సామేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు లిస్థానిక సంస్థ ఎన్నికల గురించి మాట్లాడడం జరుగింది . జనవరి 29వ తేదీ జరిగినటువంటి రాష్ట్రస్థాయి స్థానిక సంస్థల ఎన్నికల సన్నాక సమావేశం గురించి వివరిస్తూ గ్రామస్థాయికి బహుజన సమాజ్ పార్టీని తీసుకెళ్లే విధంగా కార్యాచరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ వార్డు, సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, కౌన్సిలర్, ఎన్నికల్లో పార్టీ ఎంత బలంగా ఉంటే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంలో ఎదురుకోవడానికి బలంగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామలింగయ్య, దీాఖీ జోనల్ ఇంచార్జ్ బొగ్గుల హనుమన్న, నియోజకవర్గ అధ్యక్షులు బంగారప్ప, ఫయాజ్, యాకోబు, నియోజకవర్గ మండల స్థాయి నాయకులు చంద్ర, బాలు, లక్ష్మన్న, అబ్రహం, మాలపల్లి సుధా, గిరి, చిన్న మహదేవ్ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

# వైసీపీ నేతల ఇళ్లపై పెట్రోల్ బాంబులు

**రాష్ట్రంలో ఆటవిక పాలన నడుస్తోందని వైసీపీ లీగల్ సెల్ మండిపాటు..!!**



**నంద్యాల : ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు తుంగలో తొక్కబడుతున్నాయని,కూటమి ప్రభుత్వ హయాంలో గూండారాజ్యం నడుస్తోందని వైసీపీ లీగల్ సెల్ నాయకులు పి.శ్రీనివాసులు,ఎం ప్రతాప్ రెడ్డి,తిమ్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు,జోగి రమేష్ నివాసాలపై కర్రలు,రాడ్లు,పెట్రోల్ బాంబులతో జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజకీయ విభేదాల పేరుతో ఇళ్లపై దాడులు చేయడం,ఇంట్లో ఉన్న మహిళలపై భౌతిక దాడులకు పాల్పడడం అత్యంత అమానుషమని పేర్కొన్నారు.తప్పు ఉంటే న్యాయస్థానాలను ఆశ్రయించాలి గానీ,న్యాయం కోరిన వారిపై దాడులు చేయడం ఏ విధమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు తప్పుగా అనిపిస్తే కోర్టుకు వెళ్లాలని,అంతేగానీ గూండాలను రెచ్చగొట్టి ఇళ్లపై దాడులు చేయడం దారుణమని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా?? లేక ఆటవిక రాజ్యమా?? అని ప్రశ్నించారు. తిరుపతి లడ్డులో కల్తీ లేదని సీబీఐ స్పష్టం చేసినప్పటికీ,ఆ అంశాన్ని వక్రీకరిస్తూ వైసీపీ నాయకులపై అవాకులు చవాకులు పేల్చడం సరికాదన్నారు. వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టడం,దౌర్జన్యాలకు పాల్పడడం ద్వారా కూటమి ప్రభుత్వం డైవర్ట్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. అభివృద్ధి,సంక్షేమ పథకాల అమలులో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం ప్రజల ప్రశ్నల నుంచి తప్పించుకునేందుకే ఇలాంటి దాడులు, బెదిరింపులకు దిగుతోందన్నారు. ఇలాగే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఊరుకునేది లేదని,చట్టపరంగా గట్టి పోరాటం చేస్తామని వైసీపీ లీగల్ సెల్ నాయకులు హెచ్చరించారు. భవిష్యత్తులో వైసీపీ నాయకులపై ఇలాంటి దాడులు కొనసాగితే ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వైసీపీ లీగల్ సెల్ స్టేట్ జనరల్ సెక్రెటరీ పి శ్రీనివాసులు,నంద్యాల ప్రెసిడెంట్ ఏం.ప్రతాప్ రెడ్డి,అఫీషియల్ స్పోక్స్ పర్సన్ తిమ్మారెడ్డి, వివేకానంద రెడ్డి మరియు పలువురు నాయకులు,న్యాయవాదులు పాల్గొన్నారు.

## అహోబిలం బ్రహ్మోత్సవాలపై ఎమ్మెల్యే సమీక్ష



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
అహోబిలం బ్రహ్మోత్సవాలను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలసికట్టుగా పని చేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ విజ్ఞప్తి చేశారు. ఈనెల 20 నుంచి అహోబిలంలో జరగనున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి మంగళవారం అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే అఖిలప్రియ సమీక్షా సమావేశం నిర్వహించారు. దేవస్థానం భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అహోబిలం మేనేజర్ రామానుజన్ డీఎస్పీ ప్రమోద్ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కర్నూలు కు వెళ్లిన కిషన్ మోర్చా అసెంబ్లీ ఇన్చార్జి సిసి రంగన్న



**పత్తికొండ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
బిజెపి రాష్ట్ర కిషన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి జిల్లా పర్యటన వస్తున్న సందర్భంగా మంగళవారం పత్తికొండ బిజెపి కిషన్ మోర్చా అసెంబ్లీ ఇన్చార్జి సీసీ.రంగన్న ఆధ్వర్యంలో కర్నూల్ కు బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కిషన్ మోర్చా అధ్యక్షులు జిల్లా పర్యటన లొ పెండింగ్ ప్రాజెక్టుల సందర్శన,కర్నూల్ మార్కెట్ యార్డ్ లో రైతులతో గిట్టుబాటు ధరపై ముఖాముఖి కార్యక్రమం,100 రోజుల జి రాంజీ ఉపాధి పని దినాలు125 రోజులు వరకు పెంపుపై రైతులకు అవగాహన కల్పించడం కార్యక్రమం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు శంకరయ్య, ఆర్కే సురేంద్ర,గోరంట్లయ్య,తదితరులు వెళ్లారు.

## ఘనంగా ముగిసిన పార్వేట ఉత్సవాలు

**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 3 డ్రీమ్ టైమ్స్:**
ఆళ్లగడ్డలో 4 రోజులుగా జరుగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పార్వేట ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. స్థానిక గొల్ల సుబ్బమ్మ తెలుపు వద్ద శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారు పూజలు అందుకున్నారు. ఎస్సీ కాలనీలో చిట్ట చివరగా పూజలు చేసిన అనంతరం ఎస్. లింగందిన్నెకు స్వామివారి పార్వేట పల్లకి బయలుదేరింది.



## బిజినెస్

# భారీగా తగ్గనున్న స్మార్ట్ ఫోన్ల ధరలు..

ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ 2026 బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అయితే ఈసారి ప్రభుత్వం సాంకేతికత, తయారీ రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. లిథియం-అయాన్ బ్యాటరీ పరిశ్రమ కోసం ప్రత్యేకంగా ఒక ప్రధాన ప్రకటన సాధారణ ప్రజల జేబులపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. లిథియం-అయాన్ బ్యాటరీల ఉత్పత్తిలో ఉపయోగించే ముడి పదార్థాలపై ప్రాథమిక కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం తగ్గించింది. ఈ బ్యాటరీలు రెండింటిలోనూ ఉపయోగిస్తున్నందున ఇది స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాల ధరలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ముడి పదార్థాలపై పన్నులు తగ్గించడం వల్ల బ్యాటరీ తయారీ కంపెనీలకు ఖర్చులు తగ్గుతాయని ప్రభుత్వం విశ్వసిస్తోంది. తయారీ చౌకగా మారినప్పుడు అది తుది ఉత్పత్తి ధరపై కూడా ప్రభావం చూపుతుంది. తత్ఫలితంగా మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రిక్ వాహనాలు భవిష్యత్తులో మరింత సరసమైనవిగా మారవచ్చు. ఈ నిర్ణయం కంపెనీలకు మాత్రమే కాకుండా అధిక ధరల కారణంగా స్మార్ట్‌ఫోన్‌లు, ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయకుండా వాయిదా వేస్తున్న లక్షలాది మంది వినియోగదారులకు



కూడా ఉపశమనం కలిగించవచ్చు. ఈ బడ్జెట్ నిర్ణయం వెనుక ప్రభుత్వ ప్రధాన లక్ష్యం దేశీయ తయారీని బలోపేతం చేయడం. భారతదేశం బ్యాటరీలు, వాటి భాగాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉంది. కస్టమ్స్ సుంకాలలో ఉపశమనం కల్పించడం ద్వారా దేశీయ బ్యాటరీ ఉత్పత్తిని పెంచడం, భారతదేశం ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదగడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. లిథియం-అయాన్ బ్యాటరీలను నేడు మొబైల్ ఫోన్ల నుండి ఎలక్ట్రిక్ వాహనాల వరకు ప్రతిచోటా ఉపయోగిస్తున్నారు. ఈ చర్య వ్యూహాత్మకంగా ముఖ్యమైనదిగా పరిగణిస్తున్నారు. ఈ నిర్ణయం ప్రభావం 2026-27 ఆర్థిక సంవత్సరం నాటికి స్పష్టంగా కనిపిస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. కార్పొరేట్ ఖర్చులు తగ్గడంతో మార్కెట్లో పోటీ పెరుగుతుంది. అలాగే ప్రయోజనాలు నేరుగా వినియోగదారులకు అందుతాయి. సరళంగా చెప్పాలంటే, భవిష్యత్తులో సాంకేతికత చౌకగా, మరింత అందుబాటులోకి రావచ్చు. అదనంగా ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక పెద్ద అడుగు వేసింది. ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ తయారీ పథకానికి ఇప్పటికే రెట్టింపు పెట్టుబడి లక్ష్యం వచ్చిందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఈ విశ్వాసాన్ని బలోపేతం చేస్తూ, 2026-27 బడ్జెట్‌లో ఈ పథకానికి సుమారు రూ. 40,000 కోట్లు కేటాయించారు. 2026 బడ్జెట్‌లో ఈ నిర్ణయం పరిశ్రమకే కాకుండా సాధారణ వినియోగదారులకు కూడా స్వాగతించదగిన ఉపశమనం. ప్రతిదీ ప్రణాళిక ప్రకారం జరిగితే, భవిష్యత్తులో కొత్త స్మార్ట్‌ఫోన్ కొనడం తక్కువ ఖర్చుతో కూడుకున్నది కావచ్చు.

## రూపాయి.. జిగేల్.. జిగేల్

**ఒకేరోజు 117 పైసలు పెరిగిన మారకం విలువ**



**ముంబై, ఫిబ్రవరి 3:**
రూపాయి జిగేల్.. జిగేల్‌మన్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ మంగళవారం ఒకేరోజు 117 పైసలు ఎగబాకింది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 117 పైసలు లేక 1.28 శాతం బలపడి 90.32 వద్ద ముగిసింది. ఆసియా కరెన్సీల్లో అత్యంతగా బలపడ్డ కరెన్సీ రూపాయి కావడం విశేషం. భారత్-అమెరికా దేశాల మధ్య ట్రేడ్ డీల్ కుదరడంతో రూపాయి దూసుకుపోయిందని, గడిచిన రెండు నెలల్లో ఒకేరోజు ఇంతటి స్థాయిలో పెరగడం ఇదే తొలిసారని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలోపేతం కావడం కూడా రూపాయికి మరింత కిక్కునిచ్చిందన్నారు. వీటికి తోడు క్రూడాయిల్ ధరలు బలహీనంగా ఉండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడం పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందన్నారు. 90.30 వద్ద ప్రారంభమైన డాలర్-రుపీ ఎక్స్ఛేంజ్ రేటు ఇంట్రాడేలో 90.05 గరిష్ఠ స్థాయిని తాకగా, ఒక దశలో 90.52 కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. చివరకు నిన్నటి ముగింపుతో పోలిస్తే 117 పైసలు ఎగబాకి 90.32 వద్ద స్థిరపడింది. సోమవారం కూడా రూపాయి విలువ 44 పైసలు పెరిగిన విషయం తెలిసిందే. దీంతో గడిచిన రెండు రోజుల్లో 161 పైసలు పెరిగినట్టు అయింది.

## టెస్లా కార్లపై ఆఫర్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3**
టెస్లా అమ్మకాలు పెంచుకోవడానికి, కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఈఎంఐ, ఎక్స్ఛేంజ్ రాయితీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్ కార్లను కొనుగోలు చేసే కస్టమర్లను ఎలక్ట్రిక్ కార్ల వైపు మళ్లించడానికి సంస్థ..రూ. 3 లక్షల వరకు ఎక్స్ఛేంజ్ ఇన్సెంటివ్ ఇస్తున్నట్టు ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతోపాటు మాడల్ వైను కొనుగోలు చేసిన వారు డౌన్‌పేమెంట్ కింద రూ. 6 లక్షలు చెల్లించి, నెలకు రూ. 49 వేల ఈఎంఐతో కారు అందిస్తున్నది.



# రీ ఎంట్రీలో అదరగొట్టిన తెలుగోడు..

## స్పోర్ట్స్

**టీ20 వరల్డ్‌కప్ వార్మప్ మ్యాచ్‌లో భారత్-ఏ ఘన విజయం**

టీమిండియా యువ మిడిల్ ఆర్డర్ బ్యాటర్ తిలక్ వర్మ రీ ఎంట్రీలోనే తన ప్రతిభను చాటుకున్నాడు. శస్త్రచికిత్స కారణంగా ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు దూరమైన ఈ ఎడమచేతి బ్యాట్స్‌మన్ ఇప్పుడు పూర్తిస్థాయి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించి మైదానంలోకి అడుగుపెట్టాడు. టీ20 వరల్డ్‌కప్ 2026కు ముందు జరుగుతున్న వార్మప్ మ్యాచ్‌ల్లో భాగంగా భారత్-ఏ జట్టు తరఫున యూఎస్‌ఏపై బరిలోకి దిగిన తిలక్ వర్మ చురుకైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. అతని ప్రదర్శన భారత జట్టుకు మంచి సంకేతంగా మారింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్ వర్మ ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. కేవలం 24 బంతుల్లోనే 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు సాధించాడు.
ముఖ్యంగా షాట్ల ఎంపిక, స్ట్రైక్ రొటేషన్‌లో అతని నైపుణ్యం స్పష్టంగా కనిపించింది. గాయానంతరం ఎలాంటి అసౌకర్యం లేకుండా బ్యాటింగ్ చేయడంతో




పాటు ఫీల్డింగ్‌లోనూ చురుకుగా కదిలి తన ఫిట్‌నెస్‌పై సందేహాలకు చెక్ పెట్టాడు. టీ20 వరల్డ్‌కప్ దృష్ట్యా అతని ఈ ఫామ్ భారత జట్టుకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా మారింది. మ్యాచ్ విషయానికి వస్తే భారత్-ఏ జట్టు 38 పరుగుల తేడాతో యూఎస్‌ఏపై ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 238 పరుగుల భారీ స్కోర్ చేసింది. టాప్ ఆర్డర్ బ్యాటర్ జగదీశన్ అద్భుత శతకంతో మెరిశాడు. అతను 55 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టుకు బలమైన పునాది వేశాడు. కెప్టెన్ ఆయుష్ బదోని కూడా దూకుడుగా ఆడి కేవలం 26 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో అజేయంగా 60 పరుగులు సాధించాడు. మధ్యలో తిలక్ వర్మ వేగవంతమైన ఇన్నింగ్స్ జట్టుకు మరింత ఊపునిచ్చింది. 239 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన యూఎస్‌ఏ జట్టు ప్రారంభంలో కొంత పోరాటం చూపించినప్పటికీ చివరికి భారత బౌలర్ల ముందు నిలవలేకపోయింది. 19.4 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌటైంది. యూఎస్‌ఏ బ్యాటర్లలో ఆండ్రీస్ గాస్ 44 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, సంజయ్ కృష్ణమూర్తి 41 పరుగులు చేశాడు. అయితే భారత బౌలింగ్ దాడిని ఎదుర్కోవడంలో వారు విఫలమయ్యారు. భారత్-ఏ బౌలర్లలో రవి బిష్ణోయ్ అద్భుతంగా బౌలింగ్ చేసి మూడు కీలక వికెట్లు తీసుకున్నాడు. నమన్ ధీర్, ఖలీల్ అహ్మద్ చెరో రెండు వికెట్లు పడగొట్టి జట్టుకు విజయాన్ని ఖాయం చేశారు. మొత్తంగా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టి ప్రదర్శన కనబరిచిన భారత్-ఏ జట్టు వార్మప్ మ్యాచ్‌లో సత్తా చాటి టీ20 వరల్డ్‌కప్‌కు ముందు మంచి ఆత్మవిశ్వాసాన్ని సంపాదించింది. తిలక్ వర్మ రీ ఎంట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలవడం భారత అభిమానులకు ఉత్సాహాన్ని కలిగించింది.

## ఢిల్లీ నాలుగోసారి..
## ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై ఘనవిజయం

**బెంగళూరుతో టైటిల్ పోరుకు సిద్ధం**

**వడోదర**
మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా నాలుగోసారి ఫైనల్ చేరింది. టోర్నీ ఆరంభ దశలో పడుతూ లేస్తూ ఆడిన ఆ జట్టు.. కీలకమైన



ఎలిమినేటర్ పోరులో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సత్తాచాటింది. వడోదరలో గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన పోరులో ప్రత్యర్థిని 7 వికెట్ల తేడాతో చిత్తుచేసిన ఢిల్లీ.. ఈనెల 5న (గురువారం) ఇదే వేదికలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)తో అమీతుమీ తేల్చుకోనుంది. గుజరాత్ నిర్దేశించిన 169 పరుగుల లక్ష్యాన్ని క్యాపిటల్స్ 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. లిజెల్లె లీ (24 బంతుల్లో 43, 8 ఫోర్లు, 1 సిక్స్), కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్ (23 బంతుల్లో 41, 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్.. నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 వద్దే పరిమితమైంది. బెత్ మూనీ (51 బంతుల్లో 62 నాటౌట్, 6 ఫోర్లు), జార్జియా వర్హైమ్ (35) మినహా మిగిలినవారంతా విఫలమయ్యారు.

మూనీ ఒంటరి పోరాటం


రెండో ఓవర్లోనే డెవిన్ (6)వికెట్‌ను కోల్పోయినా పవర్ ప్లేలో గుజరాత్ నిలకడగానే ఆడింది. కాప్ వేసిన 4వ ఓవర్లో 17 పరుగులు రాబట్టి జోరు మీద కనిపించిన ఆ జట్టుకు ఆరో ఓవర్లో బంతినందుకున్న నందని వరుస బంతుల్లో షాకిచ్చింది. తొలి బంతికి అనుష్క (16)ను వెనక్కిపంపిన ఆమె.. రెండో బంతికి గుజరాత్ సారథి ఆష్లీ గార్డ్‌నర్‌ను డకౌట్ చేసి కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో గుజరాత్ స్కోరు వేగం నెమ్మదించింది. 9వ ఓవర్లో మిన్ను మణి.. కనిక అహుజా (6)నూ బోల్తా కొట్టించడంతో క్రీజులోకి వచ్చిన వర్హైమ్ (35)తో కలిసి మూనీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. కానీ హెన్రీ 17వ ఓవర్లో గుజరాత్‌కు డబుల్ షాకులిచ్చింది. వర్హైమ్‌తో పాటు ఫల్మలిని ఔట్ చేసి ఆ జట్టు భారీ స్కోరు చేయకుండా అడ్డుకట్ట వేసింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లకు 168/7 (మూనీ 62బి, వర్హైమ్ 35, హెన్రీ 3/35, నందని 2/23);
ఢిల్లీ: 15.4 ఓవర్లకు 169/3 (లీ 43, జెమీమా 41, వర్హైమ్ 2/28, రాజేశ్వరి 1/33)

# ఇప్పుడే చెప్పలేను..

**మెల్‌బోర్న్**
వెన్ను గాయం కారణంగా టీ20 ప్రపంచకప్ నుంచి తప్పుకున్న ఆస్ట్రేలియా పేసర్ పాట్ కమిన్స్ ఐపీఎల్‌లో అయినా ఆడతాడా? లేదా? అన్నదానిపై సందిగ్ధత కొనసాగుతున్నది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్)కు సారథిగా ఉన్న కమిన్స్.. గాయం నుంచి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. ఐపీఎల్‌కు అతడు దూరమవనున్నాడని వార్తలు వస్తున్న వేళ కమిన్స్ స్పందిస్తూ.. 'త్వరలో నాకు మరో స్కాన్ చేయాల్సి ఉంది. ఒకవేళ అంతా బాగుంటే నేను ఐపీఎల్ కోసం సిద్ధమవుతా. టెస్టులతో పోల్చితే టీ20లు ఆడటం తేలిక' అని అన్నాడు





# పిఆర్‌పై పెద్దగా ఆధారపడను:

బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదోఒక అంశం వైరల్‌గా మారుతూనే ఉంటుంది. ఒకప్పుడు బంధుప్రీతిపై, కొన్ని రోజుల క్రితం వర్కింగ్ అవర్స్ చర్చనీయాంశమైంది. ఇప్పుడు పీఆర్ వ్యవస్థపై అందరూ కామెంట్స్ చేస్తున్నారు. హిందీ చిత్ర పరిశ్రమలో పీఆర్ వ్యూహాలు మరో స్థాయికి చేరాయని పేర్కొంటున్నారు. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ ఓ ఇంటర్వ్యూలో పబ్లిసిటీ సంస్కృతిపై స్పందించారు. 'పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లుతున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుంది. వాళ్లకు మనస్సాక్షి ఉండదా అని ఎప్పుడూ అనుకుంటాను. ఇలాంటివారు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను. నాకు పీఆర్ అవసరం లేదని అన్నారు. ఇక ఫొటోగ్రాఫర్లపై కూడా రకుల్ అసహనం వ్యక్తంచేశారు. తాను ఒకే జీన్స్‌ను నెలకు ఐదు సార్లు వేసుకుంటానని అన్నారు. ఈ విషయాన్ని కూడా ఫొటోగ్రాఫర్లు పరిశీలిస్తున్నారని, వారికి హద్దు ఉండాలని చెప్పారు. తాను దుస్తులకు అధిక ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు.

# శరవేగంగా వారణాసి మూవీ షూటింగ్

## రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్ల క్యూ అంటూ వార్తలు




బాహుబలి, ఆర్ఆర్ఆర్ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయి దాటి పాన్ వరల్డ్ రేంజ్‌కి దూసుకువెళ్లారు దర్శకధీరుడు రాజమౌళి. ప్రస్తుతం ఆయన దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. ఈ చిత్రంలో హీరోయిన్‌గా హాలివుడ్ బ్యూటీ ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ హీరో పృధ్వి రాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. అయితే తాజాగా ఈ సినిమా గురించి ఒక న్యూస్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది. ప్రస్తుతం 'వారణాసి' సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ సినిమా షెడ్యూల్ హైదరాబాద్‌లోని కోకాపేట, అల్యూమినియం ఫ్యాక్టరీ పరిసరాల్లో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో మహేశ్ బాబు- ప్రియాంక చోప్రాపై కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు టాక్. ఈ షెడ్యూల్ క్లోజ్ అయిన వెంటనే, చిత్ర బృందం జార్జియా వెళ్లడానికి రడీ అవుతుందని సమాచారం. ఇదే టైంలో ఈ సినిమా డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం డిస్ట్రిబ్యూటర్లు క్యూ కడుతున్నారని సినీ సర్కిల్‌లో జోరుగా ప్రచారం జరుగుతుంది. ఏపీ, తూర్పు గోదావరి ఏరియాకు రూ.18 కోట్ల ఆఫర్ చేస్తున్నట్లు ట్రేడ్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిజానికి ఈ రేంజ్‌లో భారీ ఆఫర్లు వచ్చినా తక్షణమే బిజినెస్ స్టార్ట్ చేసేందుకు జక్కన్న టీమ్ ఆసక్తిగా లేదని సమాచారం. ఎందుకంటే బాహుబలి, ఆర్ఆర్ఆర్ తరహాలోనే వారణాసి మూవీ విషయంలో కూడా రాజమౌళి స్ట్రాటజీ ఉంటుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. అందుకే వారణాసి సినిమా పూర్తయ్యాకే పూర్తి స్థాయి మార్కెట్ వ్యూహంతో డిస్ట్రిబ్యూషన్‌కు వెళ్లాలని రాజమౌళి టీం ప్లాన్ అని చెబుతున్నారు.

# ఆ డైరెక్టర్ నైట్ డ్రెస్ వేసుకోమన్నాడు..

రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూకు హాజరైన హీరోయిన్ ఐశ్వర్య.. తన లైఫ్‌లో జరిగిన ఓ చేదు సంఘటనను షేర్ చేసుకున్నారు. .తన కెరీర్ స్టార్టింగ్ లో తాను ఒక సినిమా ఆడిషన్స్ కి వెళ్లానని చెప్పిన ఆమె.. అక్కడ ఆ డైరెక్టర్ తనను నైట్ డ్రెస్సులో కనిపించు అన్నాడంటూ ఐశ్వర్య చెప్పుకొచ్చారు. ఎందుకంటే, అతను తన బాడీ చుడాలని అన్నాడని.. ఆ సమయంలో తనకు చాలా కోపం వచ్చినట్టు చెప్పుకొచ్చారు. అంతేకాదు ఇలా అతను ఎంతమందిని అడిగి ఉంటాడోనని తరువాత అనుకున్నానని.. చాలా బాధేసిందంటూ ఎమోషనల్ అయ్యాడు. అయితే, తనను అలా అడిగిన దర్శకుడు ఎవరు అనేది మాత్రం రివీల్ చేయలేదు ఈ బ్యూటీ. కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ పాలిటిక్స్‌లోకి రానని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. తనకు రాజకీయాల్లోకి వచ్చే ఉద్దేశమే లేదన్నారు. తాజాగా తండ్రి నిర్ణయంపై ఆయన కుమార్తె సౌందర్య రజినీకాంత్ స్పందించారు. విత్ లవ్ మూవీ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు ఆమె స్పందించారు. తన తండ్రి నిర్ణయం పట్ల తమకెలాంటి బాధ లేదన్నారు. ఆయనకు ఏది నచ్చితే కుటుంబమంతా మద్దతుగా ఉంటుందని తెలిపారు.



# ధురంధర్ 2' ఎఫెక్ట్..

## వాయిదా దిశగా అడివి శేష్ 'డెకాయిట్'?




టాలీవుడ్ యువ నటుడు అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'డెకాయిట్: ఏ లవ్ స్టోరీ'. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రం తాజాగా వాయిదా పడనుందనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. వాస్తవానికి ఈ చిత్రాన్ని మార్చి 19న ఉగాది కానుకగా విడుదల చేస్తామని మేకర్స్ గతంలోనే ప్రకటించారు. అయితే అదే సమయంలో బాలీవుడ్ భారీ ప్రాజెక్ట్ రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2'తో పాటు కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న 'టాక్సిక్' చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద తీవ్ర పోటీ నెలకొంది. ఈ భారీ చిత్రాల మధ్య థియేటర్ల లభ్యత, కలెక్షన్ల పరంగా ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో చిత్ర యూనిట్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఈ తాజా పరిణామాల నేపథ్యంలో 'డెకాయిట్' చిత్రాన్ని ఏప్రిల్ 10, 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు సమాచారం. గతంలో ఈ బాక్సాఫీస్ క్లాష్ గురించి అడివి శేష్ స్పందిస్తూ తమ సినిమా పెద్ద చేపల మధ్య ఒక 'గోల్డ్ ఫిష్' లాంటిదని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే సోలో రిలీజ్ కోసం వెతకడమే శ్రేయస్కరమని టీమ్ భావిస్తోంది. షానీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ సినిమా విడుదల తేదీపై అన్నపూర్ణ స్టూడియోస్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831